


www.aksharamtelugudaily.com RNI NO: TELTEL/2018/75419

# సుఫల అక్షరం

సామాన్యుడి అస్త్రం / తెలుగు దినపత్రిక

SUPHALA AKSHARAM

SUNDAY 09TH AUGUST 2026 EDITOR : SHAIK YACOOB PASHA PAGES : 12 VOLUME : 09 ISSUE : 144 COST : 3\- KHAMMAM, TELANGANA

ఆదివారం 09 ఆగస్టు 2026 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా పేజీలు : 12 సంపుటి : 09 సంచిక :144 వెల : రూ.3/- ఖమ్మం, తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, A SIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

## మరింత విషమంగా మెడికో ప్రియాంక ఆరోగ్యం

హైదరాబాద్,ఆగస్ట్8 రాజమండ్రి మెడికో విద్యార్థిని ప్రియాంక ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా ఉంది. ప్రస్తుతం వెంటిలేటర్‌పై వైద్యులు ఆమెకు చికిత్స అందజేస్తున్నారు. ఇటీవల రాజమండ్రిలోని ప్రసాద్ ఆదిత్యామాల్‌లో స్కూటీపై వెళ్తున్న మెడికోలు డాక్టర్ ప్రియాంక, దుర్గవెంకటసాయిలను మద్యం సేవించిన కొందరు యువకులు కారుతో బలంగా ఢీకొట్టారు. ఈ నేపథ్యంలో ప్రియాంక తలపై నుంచి కారు వెళ్లడంతో బ్రెయిన్ డెడ్‌కు గురైంది. దీంతో విద్యార్థినిని హుటాహుటిన రాజమండ్రి నుంచి హైదరాబాద్‌కు తరలించగా.. కిమ్స్ ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స కొనసాగుతోంది. గడిచిన ఆరో రోజులుగా ప్రియాంక మృత్యువుతో పోరాడుతోంది. మెడికో ప్రియాంక చికిత్సలో చివరి ప్రయత్నంగా నేడు ఆప్నియా పరీక్ష చేయనున్నారు.



## ఇకనుంచి స్మార్ట్ రేషన్ కార్డులు

- 15 ఆగస్టున ప్రారంభించనున్న సిఎం

నిజామాబాద్,ఆగస్ట్8 రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి జిల్లా పౌర సరఫరాల శాఖ సన్నద్ధమవుతోంది. స్మార్ట్ కార్డు విషయంలో దాదాపు 8 నెలల నుంచి ప్రభుత్వం చేసిన ఆలోచన ఎట్టకేలకు కార్యరూపం దాల్చనుంది. ఆగస్ట్ 15న సంగారెడ్డిలో సిఎం వీటిని ప్రారంభిస్తారు. ఈ స్మార్ట్ కార్డులతో బోగస్ కార్డుల ఎత్తివేత సులువవుతందని భావిస్తున్నారు. జిల్లాల వారిగా స్మార్డ్ కార్డు పంపిణీ అంశంపై శ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పౌర సర ఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర పౌరసరఫరాల శాఖ అధికారులతో

➤ మిగతా 2వ పేజిలో..

## ఎంసీఆర్ టిమ్స్ ప్రారంభానికి సన్నాహాలు



- ప్రజలకు అందుబాటులోకి ఎంసీఆర్ టిమ్స్
- మిగిలిన పనులు వేగంగా పూర్తి
- సూపర్ స్పెషాలిటీ సేవల లక్ష్యం
- మంత్రి దామోదర్ రాజనర్సింహ

హైదరాబాద్, ఆగస్టు 8 రాష్ట్ర ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను అందించేందుకు సిద్ధమవుతున్న డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ వైద్య విజ్ఞాన సంస్థ (ఎంసీఆర్ టిమ్స్) ప్రారంభానికి రంగం సిద్ధమవుతోంది. ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శనివారం ఆసుపత్రిని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆసుపత్రిని త్వరలోనే ప్రజలకు అంకితం చేయనున్నట్లు ఈ సందర్భంగా వెల్లడించారు. రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఈ సంస్థ కీలక పాత్ర పోషించనుందని మంత్రి పేర్కొన్నారు. ఆసుపత్రి ప్రారంభానికి ముందు అన్ని విభాగాలు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలోని ఏ, బీ, సీ బ్లాకులను సందర్శించిన ఆయన, అక్కడ ఏర్పాటు చేసిన వైద్య పరికరాలు, మౌలిక వసతులు, రోగులకు కల్పించనున్న సేవలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యులు, నర్సులు, సిబ్బందితో మాట్లాడి అందుబాటులో ఉన్న సౌకర్యాలు, అవసరమైన ఏర్పాట్లపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఆసుపత్రి ప్రారంభమైన మొదటి రోజు నుంచే రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరా, నీటి వసతి, పారిశుధ్యం, భద్రత, అగ్నిమాపక వ్యవస్థలు, అత్యవసర సేవలు వంటి అంశాల్లో ఎలాంటి లోపాలు ఉండకూడదని సూచించారు. ఆసుపత్రిలోని ప్రతి విభాగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండేలా మిగిలిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వైద్య సేవల నిర్వహణకు అవసరమైన మానవ వనరుల కల్పనపై కూడా మంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది, సాంకేతిక నిపుణులు, పరిపాలనా సిబ్బంది తగిన సంఖ్యలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోగులకు వైద్య సేవలతో పాటు అవసరమైన ఇతర సహాయక సేవలు కూడా నిరంతరాయంగా అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు.

ఎంసీఆర్ టిమ్స్‌ను రాష్ట్రంలో అత్యాధునిక సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించే ప్రముఖ ప్రభుత్వ వైద్య సంస్థగా అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. అత్యవసర వైద్యం, క్రిటికల్ కేర్, అవయవ మార్పిడి చికిత్సలు, ప్రత్యేక వైద్య విభాగాలు, ఆధునిక పరికరాలతో కూడిన చికిత్సా సేవలు ఒకే వేదికపై అందించేలా ఆసుపత్రిని తీర్చిదిద్దుతున్నామని వివరించారు. దీనివల్ల ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుందని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించాలన్న ప్రభుత్వ సంకల్పంలో ఎంసీఆర్ టిమ్స్ కీలక మైలురాయిగా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. ఈ ఆసుపత్రి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిన తర్వాత హైదరాబాద్‌లోని ఇతర ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రులపై ఒత్తిడి తగ్గడంతో పాటు సూపర్ స్పెషాలిటీ చికిత్స అవసరమైన వేలాది మంది రోగులకు మెరుగైన వైద్య సేవలు లభిస్తాయని తెలిపారు. ప్రారంభం నుంచే అత్యుత్తమ సేవలు అందేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు.

## గూఢచర్యం కేసులో పోలీసుల అదుపుతో వింగ్ కమాండర్

- హనీట్రాప్‌తో లోబర్చుకున్న పాక్ మహిళ
- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

న్యూఢిల్లీ,ఆగస్ట్8 పాక్ కోసం గూఢచర్యానికి పాల్పడ్డ భారత ఎయిర్‌ఫోర్స్ వింగ్ కమాండర్‌ను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జాతీయ మీడియా కథనాల ప్రకారం మే నెలలోనే పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఉదంతం వెనుక భారీ గూఢచర్య నెట్‌వర్క్ ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. పాక్ నిఘా ఆఫీసర్లు పన్నిన హనీట్రాప్‌లో వింగ్ కమాండర్ పడ్డాడని చెప్పాయి. నిందితుడిపై అప్పటికే కొంతకాలంగా నిఘా పెట్టి ఆపై పోలీసులకు సమాచారం అందించామని ఎయిర్‌ఫోర్స్ ప్రతినిధి తెలిపారు. వ్యక్తిగత జీవితంలో ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న వింగ్ కమాండర్ హనీట్రాప్‌లో పడ్డట్టు పోలీసులు దర్యాప్తులో వెలుగులోకి

➤ మిగతా 2వ పేజిలో..

## పెద్ది కుటుంబానికి "కేసీఆర్ భరోసా"

- రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం..
- ఇద్దరు పిల్లలకు చెరో రూ. కోటి...తల్లి అమృతమ్మ సంక్షేమానికి రూ.25 లక్షలు
- కుటుంబ భవిష్యత్తుకు అండగా బీఆర్ఎస్



హైదరాబాద్, ఆగస్టు 8 స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అండగా నిలిచింది. పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆదేశాల మేరకు సుదర్శన్ రెడ్డి కుటుంబానికి మొత్తం రూ. 2. 25 కోట్ల ఆర్థిక సహాయం అందించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. కుటుంబ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సుదర్శన్ రెడ్డి ఇద్దరు పిల్లలకు చెరో రూ. 1 కోటి చొప్పున రూ. 2 కోట్ల ఆర్థిక సహాయం అందించారు. వారి విద్యాభ్యాసం, ఉన్నత విద్యతో పాటు భవిష్యత్తు అవసరాలకు ఈ ఆర్థిక సహాయం ఉపయోగపడేలా చర్యలు తీసుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. అదేవిధంగా సుదర్శన్ రెడ్డి తల్లి అమృతమ్మ సంక్షేమం కోసం రూ. 25 లక్షలను బ్యాంకులో జమ చేసినట్లు బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి. కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు, పిల్లల చదువు, ఉన్నత విద్య, భవిష్యత్తు లక్ష్యాల సాధనకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడటమే ఈ సహాయం ఉద్దేశమని పేర్కొన్నారు.

➤ మిగతా 2వ పేజిలో..

## నిజలింగప్పకు సీఎం నివాళులు

- విధానసౌధ వద్ద పుష్పాంజలి
- కర్ణాటక తొలి ముఖ్యమంత్రిని స్మరించిన డీకే శివకుమార్
- ప్రజాకేంద్ర పాలనకు ఆదర్శమని కొనియాడిన సీఎం

➤ 2వ పేజిలో..

## ఇతరులతో కాదు.. మీతో మీరే పోటీ పడండి!

- కొత్తదనం నేర్చుకునేవారిదే "భవిష్యత్ విజయం"
- జీవితానికి సిలబస్ ఉండదు.. సవాళ్లే పాఠాలు!
- కుతూహలం, సృజనాత్మకతతో ముందుకు సాగాలి
- యువత దేశాభివృద్ధికి చోదకశక్తి కావాలి
- ఐఐటీ ఢిల్లీ 57వ స్నాతకోత్సవంలో ప్రధాని మోదీ దిశా నిర్దేశం




న్యూఢిల్లీ, ఆగస్టు 8 సాంకేతిక రంగంలో వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో కొత్త విషయాలను నిరంతరం నేర్చుకునే వారే భవిష్యత్తులో విజేతలుగా నిలుస్తారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. యువత తమ ప్రతిభ, ఆలోచనా శక్తి, సృజనాత్మకతను దేశాభివృద్ధికి వినియోగించాలని పిలుపునిచ్చారు. ఐఐటీ ఢిల్లీ 57వ స్నాతకోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రధాని మోదీ విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ప్రదానం చేసి భవిష్యత్తు ప్రయాణానికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి మూడు వేల మందికిపైగా విద్యార్థులు హాజరుకాగా, 587 మంది పీహెచ్‌డీ పరిశోధకులు ఉన్నారు.

### 'పరం ప్రాగ్యా' సూపర్ కంప్యూటింగ్ కేంద్రం ప్రారంభం

ఐఐటీ ఢిల్లీ సోనిపట్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన 'పరం ప్రాగ్యా' అత్యాధునిక కృత్రిమ మేధ సూపర్ కంప్యూటింగ్ కేంద్రాన్ని ప్రధాని

➤ మిగతా 2వ పేజిలో..




## నీటి హక్కుల పరిరక్షణకు పోరాటం

- ప్రభుత్వ వైఖరిపై కేటీఆర్ తీవ్ర విమర్శలు
- రైతాంగ సమస్యలు, సాగునీటిపై ఆందోళన
- తెలంగాణ ఉద్యమ తరహాలో మరో పోరాటానికి పిలుపు

➤ 2వ పేజిలో..

# ఇకనుంచి స్మార్ట్ రేషన్ కార్డులు

వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని ఆగస్టు 15 నుంచి స్మార్ట్ కార్డులను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఆ రోజున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంగారెడ్డి జిల్లాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభిస్తారు. అదేరోజున మిగతా జిల్లాల్లో కూడా ప్రజా ప్రతినిధులు కార్డుల పంపిణీని లాంఛనంగా చేపడతారు. అయితే పంపిణీ వేదికలు, ఏర్పాట్లు తదితర అంశాలపై ఈనెల 11 వరకు స్పష్టత రానుంది. స్మార్ట్ రేషన్ కార్డు ఆకర్షణీయంగా ఉండనుంది. డ్రైవింగ్ లైసెన్స్, క్రెడిట్, డెబిట్ కార్డు సైజులో ఈజీగా వాలెట్‌లో పెట్టుకు నేలా ప్రభుత్వం రూపొందించింది. ఆధునిక సాంకేతిక విలువాలతో కార్డు ఆకర్షణీయంగా ఉంటుందని అధికా రులు అంటున్నారు. కొత్త కార్డుల దరఖాస్తు నిరంతర పక్రియ కావడంతో కార్డుల సంఖ్య పెరుగుతూనే ఉంటుంది. నిజామాబాద్ జిల్లాలో ప్రస్తుతం ఉన్న కార్డుల స్థానే కొత్త కార్డులను అందిస్తారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లా అధికారులు జాబితాను సిద్ధం చేశారు.

## 10న కలిదిండికి సిఎం చంద్రబాబు రాక

- **రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొననున్న సిఎం**

అమరావతి,ఆగస్ట్8 ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 10న ఏలూరు జిల్లా కలిదిండి మండలంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖి కార్యక్రమంతో పాటు ప్రజా వేదిక, క్యాడర్ సమావేశాల్లో ఆయన పాల్గొననున్నారు. ఇందుకు సంబంధించిన అధికారిక పర్యటన షెడ్యూల్ ఖరారైంది. ఆ రోజు ఉదయం 10:45 గంటలకి కలిదిండి ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌కు హెలికాప్టర్‌లో సీఎం చంద్రబాబు చేరుకుంటారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, టీడీపీ శ్రేణులు ఘనస్వాగతం పలకనున్నారు. అనంతరం ఉదయం 11 గంటలకు కలిదిండి తహసీల్దార్ కార్యాలయానికి ఆయన చేరుకుంటారు. 11 గంటల నుంచి 11:45 వరకు రైతులతో సీఎం చంద్రబాబు ముఖాముఖి నిర్వహిస్తారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని, పరిష్కారాల దిశగా చర్యలు చేపడతారు. ఆ తర్వాత కలిదిండిలో ప్రజా వేదిక వద్దకు చేరుకుంటారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించనున్నారు. ఉదయం 11:55 నుంచి మధ్యాహ్నం 2:05 వరకు ప్రజా వేదిక కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. మధ్యాహ్నం 2:55 గంటలకు వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో పార్టీ శ్రేణులతో సీఎం చంద్రబాబు సమావేశం నిర్వహిస్తారు. 2:55 నుంచి సాయంత్రం 4:25 వరకు క్యాడర్ సమావేశంలో పాల్గొని వారికి దిశానిర్దేశర చేయనున్నారు. సాయంత్రం 4:35 గంటలకు కలిదిండి ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌కు చేరుకుంటారు. అనంతరం 4:40 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 4:55 గంటలకు ఉండవల్లి నివాసానికి చేరుకోనున్నారు.

## 17 నుంచి ఎపి శాసనభ సమావేశాలు

అమరావతి,ఆగస్ట్8 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. 17వ తేదీన ఉదయం 10 గంటలకు శాసన మండలి మొదలు కానుంది. ఈ మేరకు ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ శనివారం నోటిఫికేషన్ విడుదల చేశారు. శాసనసభ, శాసనమండలి సెషన్ సమావేశానికి అధికారిక నోటిఫికేషన్ జారీ చేశారు. నాలుగు రోజుల పాటు 50వ వర్షాకాల సమావేశాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. 17వ తేదీ ఉదయం 9 గంటలకు ఏపీ అసెంబ్లీ సమావేశాలు మొదలవుతాయని నోటిఫికేషన్‌లో గవర్నర్ పేర్కొన్నారు. 17వ తేదీ ఉదయం 10 గంటలకు శాసన మండలి సమావేశాలు ప్రారంభమవుతాయని వెల్లడించారు. 17వ తేదీ ఉదయం ఉభయ సభల బీఏసీలు సమావేశం కానున్నాయి. సమావేశాలు ఎన్ని రోజులు జరగాలి, అజెండాను ఉభయ సభల బీఏసీలు ఖరారు చేయనున్నాయి.

## మహిళా ఎస్‌ఐపై దాడి కేసు

- **వైసీపీ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ అరెస్ట్**

శ్రీకాకుళం,ఆగస్ట్8 శ్రీకాకుళం జిల్లాలోని ఆమదాలవలస వైసీపీ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్‌ను ఏపీ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. చిలకపాలెం వద్ద రవిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహిళా ఎస్‌ఐపై దాడి కేసులో అతను ఏ-1గా ఉన్నారు. పది రోజులుగా పోలీసులు కళ్లుగప్పి రవి తిరుగుతున్నాడు. గత నెల 30వ తేదీన మాజీమంత్రి అప్పలరాజు ములాఖత్ కోసం వైసీపీ
అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శ్రీకాకుళం జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా భారీగా కార్యకర్తలతో జగన్‌కు స్వాగతం పాలకటానికి చింతాడ రవి వచ్చాడు. కొట్టారోడ్డు వద్ద బందోబస్తులో ఉన్న మహిళా ఎస్‌ఐపై దురుసుగా ప్రవర్తించటంతో పాటు అసభ్యంగా రవి, అతని అనుచరులు వ్యవహరించారు. ఈ ఘటనపై ఏపీ ప్రభుత్వం సీరియస్ అయింది. ఈ క్రమంలోనే చింతాడ రవితో పాటు 28 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి అతను పరారీలో ఉన్నాడు. రవి కోసం విస్తృతంగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు గాలించారు. ఇవాళ సాయంత్రం 7 గంటల సమయంలో ఎచ్చెర్ల మండలం చిలకపాలెం వద్ద చింతాడ రవికుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## సీతారామ నీళ్లను నిర్వాసితులకే అందించాలి

- **బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుకూరి రమేష్**

భద్రాద్రి కొత్తగూడెం,ఆగస్టు8 భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని వర్షాధార సాగు భూములకు ప్రాణాధారమైన సీతారామ ఎత్తిపోతల పథకం నీళ్లను ముందుగా స్థానిక భూ నిర్వాసితులకే మళ్లించాలని, స్థానిక అవసరాలు తీర్చకుండా ఇతర ప్రాంతాలకు తరలించడం సరికాదని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుకూరి రమేష్ అన్నారు. జూలూరుపాడు మండల కేంద్రంలో శనివారం జరిగిన బీజేపీ కిసాన్ మోర్చా ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ?గోదావరి జలాలు తమ పొలాలకు మళ్లుతాయనే ఆశతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతులు సీతారామ ప్రాజెక్టు నిర్మాణానికి తమ విలువైన భూములను త్యాగం చేశారన్నారు. ఎటువంటి ముందస్తు అనుమతులు లేకుండా గత రెండు నెలలుగా ఈ ప్రాంత రైతులకు నీళ్లు అందించకుండా నాగార్జునసాగర్ కాలువల్లోకి జలాలను తరలించడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నీటి ఎద్దడి ఉన్న స్థానిక ప్రాంతాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించిన తర్వాతే మిగులు జలాలను ఇతర ప్రాంతాలకు తీసుకెళ్తే తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతులపై నిజమైన ప్రేమ ఉంటే, తక్షణమే ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. ?సీతారామ ప్రాజెక్టు భూసేకరణ కింద నిర్వాసితులైన రైతులకు ఎకరానికి రూ.21 లక్షల చొప్పున నిధులు కేటాయించి చెల్లించాలని, సాగునీరు అందక నష్టపోయిన రైతులకు తక్షణమే పంట నష్ట పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే అవకాశం ఉన్న ప్రతి చెరువుకూ సీతారామ జలాలను తక్షణమే విడుదల చేయాలని, రాబోయే రబీ సీజన్ నాటికి జిల్లాలోని ప్రతి వ్యవసాయ భూమికీ సాగునీరు అందేలా స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

# ఇతరులతో కాదు..మీతో మీరే పోటీ పడండి!

ప్రారంభించారు. అధునాతన కంప్యూటింగ్, కృత్రిమ మేధ, పరిశోధన రంగాలకు ఈ కేంద్రం మరింత బలం చేకూరుస్తుందని పేర్కొన్నారు. సాంకేతిక రంగంలో భారత్ ప్రపంచస్థాయిలో మరింత కీలక పాత్ర పోషించేందుకు ఇలాంటి అత్యాధునిక వసతులు దోహదపడతాయని అన్నారు.

### 20--30 ఏళ్లలో ప్రపంచంలో పెను మార్పులు

రాబోయే 20 నుంచి 30 సంవత్సరాల్లో ప్రపంచం పూర్తిగా మారిపోయే అవకాశం ఉందని మోదీ పేర్కొన్నారు. కృత్రిమ మేధ, సెమీకండక్టర్లు, అంతరిక్ష సాంకేతికత, డ్రోన్లు, క్వాంటం కంప్యూటింగ్, డేటా కేంద్రాలు, విద్యుత్ వాహనాలు, శక్తి నిల్వ వ్యవస్థలు వంటి రంగాల్లో యువతకు అపార అవకాశాలు ఉన్నాయని వివరించారు.

ఐఐటీ విద్య ద్వారా సంక్లిష్ట సమస్యలను పరిష్కరించే సామర్థ్యంతో పాటు విలువైన అనుభవం, ఆలోచనా శక్తి, నాయకత్వ లక్షణాలను విద్యార్థులు సంపాదించారని ప్రధాని అన్నారు.

### జీవితానికి సిలబస్ ఉండదు

విశ్వవిద్యాలయ జీవితానికి, వాస్తవ జీవితానికి తేడా ఉంటుందని మోదీ వివరించారు. విద్యా సంస్థల్లో సిలబస్ ఉంటుందని, కానీ జీవితంలో ఎదురయ్యే సవాళ్లకు ముందస్తు పాఠ్యాంశాలు ఉండవని అన్నారు. కుతూహలం, సృజనాత్మకత, సమస్యలను అవకాశాలుగా మార్చే ధైర్యం యువతలో ఉండాలని సూచించారు.

### ఇతరులతో కాదు.. మీతో మీరే పోటీ పడండి

జీతాలు, ఉద్యోగాలు, కంపెనీలు, గుర్తింపు వంటి అంశాల్లో సామాజిక మాధ్యమాల ప్రభావానికి లోనుకావద్దని విద్యార్థులకు ప్రధాని సూచించారు. జీవితం ఒక పోటీ పట్టిక కాదని, ఇతరులతో పోల్చుకోవడం కంటే తమతో తామే పోటీ పడుతూ వ్యక్తిగత అభివృద్ధి సాధించాలని అన్నారు.పరిశోధన, ఆవిష్కరణలకు ప్రాధాన్యం ఇస్తూ దేశ పురోగతికి యువత తమ వంతు సహకారం అందించాలని, నిరంతర అధ్యయనం, వ్యక్తిగత అభివృద్ధి, దేశ ప్రయోజనాలను లక్ష్యంగా చేసుకుని ముందుకు సాగాలని మోదీ పిలుపునిచ్చారు.

## ఉద్యోగాలు అడిగితే లాఠీలేనా..?

- **బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు**

హైదరాబాద్, ఆగస్టు 8,సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వద్ద ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగ యువతపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడం తీవ్రంగా బాధాకరమని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న అణచివేత ధోరణిని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు.రాహుల్ గాంధీ ఢిల్లీలో 'మొహబ్బత్ కీ దుకాణ్' అంటూ గొప్పలు చెబుతుంటే.. తెలంగాణలో మాత్రం ఉపాధి కోసం వచ్చిన యువతపై లాఠీలు ఝుళిపిస్తున్నారని రామచందర్ రావు విమర్శించారు.

హైడ్రాలో కేవలం 150 ఉద్యోగ ఖాళీల కోసం వేలాది మంది యువత తరలిరావడం రాష్ట్రంలో నెలకొన్న నిరుద్యోగ తీవ్రతకు నిదర్శనమని అన్నారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి అద్దం పడుతోందని ఆరోపించారు.అధికారంలోకి వస్తే జాబ్ క్యాలెండర్, నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతి, స్వయం ఉపాధి కోసం రూ.10 లక్షల వడ్డీలేని రుణాలు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని రామచందర్ రావు గుర్తుచేశారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడిచినా ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని మండిపడ్డారు.హామీలను నమ్మి ఓటేసిన యువతను రోడ్లపాలు చేసి, ఉద్యోగాలపై ఆశతో వచ్చిన నిరుద్యోగులపై పోలీసులతో దౌర్జన్యం చేయించడం అన్యాయమన్నారు."ఏ యువత ఆకాంక్షలతో అధికారంలోకి వచ్చారో.. అదే యువత భవిష్యత్తును కాంగ్రెస్ ప్రభుత్వం అంధకారంలోకి నెట్టివేస్తోంది" అని ఆరోపించారు.ఉద్యోగాల కోసం వచ్చిన అభ్యర్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయాల్సిన పరిస్థితి ఎందుకు ఏర్పడిందో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు, నిరుద్యోగ యువతకు సమాధానం చెప్పాలని ఎన్. రామచందర్ రావు డిమాండ్ చేశారు.

# గూఢచర్యం కేసులో పోలీసుల అదుపుతో వింగ్ కమాండర్

వచ్చింది. సోషల్ మీడియాలో పరిచయమైన ఒక మహిళ అతడి పరిస్థితిని ఆసరాగా చేసుకుని గుఢచర్యానికి ఉసిగొల్పింది. 'చాటింగ్‌తో వాళ్ల పరిచయం మొదలైంది. ఆ తరువాత వీడియో కాల్స్ చేసుకున్నారు. అతడికి నమ్మకం కలిగించాక ఆమె మిలిటరీ కదలికల సమాచారం, ఫొటోలను కోరిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. మహిళ కోరిక మేరకు కీలకమైన సమాచారం, డాక్యుమెంట్స్‌ను వింగ్ కమాండర్ డిజిటల్ మాధ్యమాల ద్వారా షేర్ చేశాడు. ఆ తరువాత ఆమె సూచనలతో అతడు తన సహోద్యోగి ఫోన్‌లో స్పైవేర్ కూడా ఇన్‌స్టాల్ చేశాడు. రిమోట్‌గా డివైజ్‌లోని సమాచారాన్ని తస్కరించేందుకు, లోకేషన్ డేటాను తెలుసుకునేందుకు, ఫోన్ కాల్స్‌ను వినేలా స్పైవేర్‌ను డిజైన్ చేశారు. పాక్‌లోని హ్యాండ్లర్ల సూచనల ప్రకారం మహిళ ఆ వింగ్ కమాండర్‌ను ఉచ్చులోకి దింపినట్టు గుర్తించారు. ఇక శత్రుమూకలకు చేరిన సమాచారంతో ముప్పు ఎంత ఉందనేది విశ్లేషిస్తున్నట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. రక్షణ రంగానికి చెందిన సీక్రెట్ సమాచారాన్ని తెలుసుకునేందుకు ఉద్దేశించిన పాక్ నిఘా నెట్‌వర్క్‌లో మహిళ భాగమైన ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మహిళకు మార్గనిర్దేశనం చేస్తున్న విదేశీ హ్యాండర్లు ఎవరో తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నామని సంబంధిత వర్గాలు తెలిపాయి.

# నిజలింగప్పకు సీఎం నివాళులు

- **విధానసౌధ వద్ద పుష్పాంజలి**
- **కర్ణాటక తొలి ముఖ్యమంత్రిని స్మరించిన డీకే శివకుమార్**
- **ప్రజాకేంద్ర పాలనకు ఆదర్శమని కొనియాడిన సీఎం**



బెంగళూరు, ఆగస్టు 8 ఏకీకృత కర్ణాటక తొలి ముఖ్యమంత్రి స్వర్గీయ ఎస్. నిజలింగప్ప జయంతి సందర్భంగా కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆయనకు ఘన నివాళులర్పించారు. విధానసౌధ పశ్చిమ ద్వారం సమీపంలోని విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన చిత్రపటానికి పూలమాల వేసి స్మరించుకున్నారు. ఈ సందర్భంగా నిజలింగప్ప కర్ణాటక ఏకీకరణ, పరిపాలనా సంస్కరణలు, విద్యాభివృద్ధి, రాష్ట్ర సమగ్ర ప్రగతికి చేసిన సేవలను ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఆయన దూరదృష్టి, ప్రజాసేవా దృక్పథం, విలువలతో కూడిన రాజకీయాలు నేటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

ప్రజాకేంద్ర పాలనకు నిజలింగప్ప చూపిన మార్గం అన్ని తరాల నాయకులకు ఆదర్శమని డీకే శివకుమార్ అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ఆయన వేసిన పునాదులు చిరస్థాయిగా నిలిచాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మంత్రులు రామలింగారెడ్డి, ఈశ్వర్ ఖండ్రేతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని నిజలింగప్పకు ఘన నివాళులు అర్పించారు.

# నీటి హక్కుల పరిరక్షణకు పోరాటం

హైదరాబాద్, ఆగస్టు 8 రాష్ట్ర ప్రయోజనాలు, ముఖ్యంగా తెలంగాణ నీటి హక్కుల విషయంలో బీఆర్ఎస్ ఎప్పుడూ రాజీ పడదని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. శనివారం మీడియాతో మాట్లాడిన ఆయన రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాలను కాపాడాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ముఖ్యంగా సాగునీరు, విద్యుత్, రైతాంగ సమస్యల విషయంలో ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత అధికార పార్టీపై ఉందన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను పక్కనబెట్టి రాజకీయాలకే పరిమితమవుతున్న ప్రభుత్వ తీరును ప్రజలు గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్వహించిన యాగాలపై జరుగుతున్న విమర్శలను ప్రస్తావిస్తూ, దేశంలో కేసీఆర్ చేసినన్ని యాగాలు మరెవరూ చేసి ఉండరని కేటీఆర్ అన్నారు. యాగాలు, పూజలు అనేవి వ్యక్తిగత విశ్వాసానికి సంబంధించిన అంశాలని, వాటిని రాజకీయ విమర్శల కోసం ఉపయోగించడం తగదన్నారు. దైవబలం కావాలంటే ముందుగా మానవ ప్రయత్నం ఉండాలని, ప్రజల కోసం పనిచేసే సంకల్పంతో పాటు ఆధ్యాత్మిక విశ్వాసాలు కూడా సమాజంలో భాగమేనని పేర్కొన్నారు. యాగాలు నిర్వహించినందుకు విమర్శించడం కాకుండా, ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలని సూచించారు.

కాంగ్రెస్ నాయకులు చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు దేవాలయాలను సందర్శించడం, పూజలు చేయడాన్ని కూడా రాజకీయ అంశంగా మార్చి విమర్శించడం దురదృష్టకరమన్నారు. ప్రజల విశ్వాసాలను గౌరవించాల్సిన బాధ్యత రాజకీయ నాయకులపై ఉందని, మతపరమైన కార్యక్రమాలను కూడా రాజకీయ కోణంలో చూడడం సమంజసం కాదన్నారు. ప్రజా సమస్యలను పక్కనబెట్టి ఇలాంటి అంశాలపై రాజకీయ విమర్శలు చేయడం కాంగ్రెస్ నాయకుల అసహనాన్ని సూచిస్తోందని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. వ్యవసాయం, సాగునీరు, రైతాంగ సమస్యలపై ముఖ్యమంత్రికి సరైన అవగాహన లేదని ఆరోపించారు. పాలమూరు ప్రాంతానికి చెందిన వ్యక్తినని చెప్పుకునే ముఖ్యమంత్రి, అదే ప్రాంతానికి సాగునీరు అందించే విషయంలో విఫలమయ్యారని అన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదని విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టుల పూర్తి, రైతులకు నీటి అందుబాటు, పంటల రక్షణ వంటి అంశాల్లో స్పష్టమైన కార్యాచరణ కనిపించడం లేదని అన్నారు.

రాష్ట్ర నీటి హక్కుల విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యమే అత్యంత ఆందోళన కలిగించే అంశమని కేటీఆర్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని తరలిస్తుంటే తెలంగాణ ప్రభుత్వం ఏమి చేస్తోందని ప్రశ్నించారు. గోదావరి నదీ నిర్వహణ బోర్డు సమావేశాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఏమిటో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు కేటాయించిన నీటి వాటాను రక్షించేందుకు ప్రభుత్వం చురుకుగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. నీటి హక్కులు అనేవి కేవలం రాజకీయ అంశం కాదని, కోట్లాది మంది రైతుల జీవనాధారానికి సంబంధించిన కీలక అంశమని గుర్తుచేశారు. విద్యుత్ సరఫరాపైనా కేటీఆర్ ప్రశ్నలు లేవనెత్తారు. రాష్ట్రంలో 24 గంటల పాటు నిరంతరాయ విద్యుత్ సరఫరా అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతోందని, అది నిజమైతే ఆధారాలతో నిరూపించాలని సవాల్ విసిరారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం విస్మరిస్తోందని ఆరోపించారు. ప్రజలకు అందుతున్న సేవల విషయంలో వాస్తవ పరిస్థితులను ప్రభుత్వం వెల్లడించాలని కోరారు. ప్రచారాల కంటే ప్రజల అనుభవాలే నిజమైన ప్రమాణమని వ్యాఖ్యానించారు.

'హైడ్రా' పేరుతో పేదలపై కక్షసాధింపు చర్యలు జరుగుతున్నాయని కేటీఆర్ ఆరోపించారు. అభివృద్ధి పేరుతో పేదల ఇళ్లను కూల్చివేయడం, వారిని ఇబ్బందులకు గురిచేయడం సమంజసం కాదన్నారు. ప్రజల హక్కులను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని, బలహీన వర్గాలపై ఒత్తిడి తీసుకురావడం సరైన పద్ధతి కాదన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని జరగాలని, పేదల జీవితాలపై ప్రతికూల ప్రభావం పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. తాము అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా తెలంగాణ శ్రేయస్సే తమ లక్ష్యమని కేటీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలు, నీటి హక్కుల పరిరక్షణ కోసం అవసరమైతే తెలంగాణ ఉద్యమ తరహాలో మరో భారీ ప్రజా పోరాటాన్ని చేపడతామని హెచ్చరించారు. కేసీఆర్ నాయకత్వంలో ప్రజలను చైతన్యపరిచి, రాష్ట్ర హక్కుల కోసం ఉద్యమిస్తామని తెలిపారు. తెలంగాణకు సంబంధించిన ప్రతి అంశంలో ప్రజల పక్షాన నిలుస్తామని, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడే పోరాటంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని కేటీఆర్ స్పష్టం చేశారు.

## భూభారతి ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలి

- సీఎం సలహాదారు వేము నరేందర్‌రెడ్డికి వినతి...



హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/ఆగస్టు 08/అక్షరం న్యూస్:-

భూభారతి ఆపరేటర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ హనుమకొండ జిల్లా భూభారతి ఆపరేటర్ల సంఘం ఆధ్వర్యంలో శనివారం రాజ్యసభ సభ్యుడు ముఖ్యమంత్రి సలహాదారు వేము నరేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆపరేటర్ల సమస్యలను ఆయనకు వివరించినట్లు భీమదేవరపల్లి మండలం తహశీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న ధరణి ఆపరేటర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు మంచాల సాయిరాం తెలిపారు. ధరణి నుంచి భూభారతి విధానంలోకి మారిన నేపథ్యంలో ఆపరేటర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులు విధుల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను వేము నరేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఆపరేటర్ల సమస్యలను సానుకూలంగా విని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చినట్లు సాయిరాం పేర్కొన్నారు. భూభారతి సేవలను ప్రజలకు మరింత సమర్థవంతంగా అందించేందుకు ఆపరేటర్లకు అవసరమైన సౌకర్యాలు సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టి సారించాలని ఈ సందర్భంగా కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు గోళ్ల నాగరాజు, జి. శ్రీకాంత్‌రెడ్డి, ముత్తినేని సత్యనారాయణ, మలోతు శ్రీనివాస్, మేకల రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మారుపేర్లు, విజిలెన్స్ కేసుల కార్మికుల డిపెండెంట్లకు ఉద్యోగాలు ఇవ్వాలి

- రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం: వాసిరెడ్డి సీతారామయ్య



జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 8 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : సింగరేణిలో మారుపేర్లు, విజిలెన్స్ కేసుల కార్మికుల డిపెండెంట్లకు ఉద్యోగాలు రాకపోవడానికి రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య ఆరోపించారు. శనివారం ఆర్జీ-1 జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసన దీక్ష శిబిరాన్ని సందర్శించి ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సీతారామయ్య మాట్లాడుతూ.. గత ఏడెనిమిది సంవత్సరాలుగా ఈ సమస్య పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉందన్నారు. గత ప్రభుత్వం హయాంలో అసెంబ్లీలో చర్చించి, ఒకసారి పరిష్కారం కింద ఉద్యోగాలు కల్పించాలని నిర్ణయించినప్పటికీ ప్రభుత్వం మారడంతో సమస్య మళ్లీ పెండింగ్‌లో పడిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోల్‌బెల్ట్ ప్రాంతంలో ఎన్నికల ప్రచార సమయంలో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. సింగరేణి యాజమాన్యం న్యాయశాఖ, అడ్వకేట్ జనరల్ నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే ఉద్యోగాలు కల్పిస్తామని చెబుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చొరవ తీసుకుని న్యాయశాఖ మంత్రి లేదా అడ్వకేట్ జనరల్‌కు అవసరమైన ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలు ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. డిపెండెంట్ల పోరాటానికి ఏఐటీయూసీ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, నాయకులు దాసరి శ్రీనివాస్, బిట్టి వెంకటేశ్వర్లు, ఏ.వి.ఎస్. ప్రకాశ్, ప్రీతం, కార్యాలయ కార్యదర్శి తొడుపునూరి రమేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గోదావరిఖనిలో నేడు యూట్యూబ్ కళాకారుల బోనాల మహోత్సవం




జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 8 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: గోదావరిఖని యూట్యూబ్ కళాకారుల ఆధ్వర్యంలో బోనాల మహోత్సవం--2026ను ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 9 గంటలకు మార్కండేయ కాలనీలోని శ్రీ లక్ష్మీ ఫంక్షన్ హాల్ నుంచి బోనాల ఊరేగింపు ప్రారంభమవుతుంది.

ఊరేగింపు రాజేష్ థియేటర్, వంకబెండు సెంటర్ మీదుగా లేబర్ కోర్టు నుంచి చౌరస్తాలోని పోచమ్మ దేవాలయం వరకు కొనసాగనుంది. భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఈ బోనాల మహోత్సవంలో యూట్యూబ్ కళాకారులు, భక్తులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కార్యక్రమ కన్వీనర్ కొమ్మ కుమార్ యాదవ్, కో-కన్వీనర్ వేముల అశోక్ పిలుపునిచ్చారు.

# సింగరేణి కార్మికుల పిల్లల మారుపేర్ల సమస్య పరిష్కరించాలి






- నిరసన దీక్షకు కోరుకంటి చందర్ సంఘీభావం

జ్యోతినగర్ ఎన్టిపిసి ఆగస్టు 8 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: సింగరేణి రిటైర్డ్ కార్మికుల పిల్లల మారుపేర్ల సమస్యతో పాటు విజిలెన్స్ పెండింగ్ కేసులను పరిష్కరించి, అర్హులైన కార్మికుల పిల్లలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసన దీక్షకు రామగుండం నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జ్, మాజీ శాసనసభ్యుడు కోరుకంటి చందర్ శనివారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా దీక్ష చేస్తున్న వారిని కలిసి మద్దతు ప్రకటించిన కోరుకంటి చందర్ మాట్లాడుతూ సింగరేణి రిటైర్డ్ కార్మికుల పిల్లలు ఏళ్లుగా ఎదుర్కొంటున్న మారుపేర్ల సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా విజిలెన్స్ పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించి, అర్హులైన కార్మికుల పిల్లలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికుల పిల్లల న్యాయమైన హక్కుల సాధన కోసం బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం సమస్య తీవ్రతను గుర్తించి తక్షణమే చర్యలు చేపట్టి కార్మిక కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుకంటి చందర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మేకల సమ్మయ్య యాదవ్, 6వ డివిజన్ కార్పొరేటర్ తోకల శామని రమేష్, మాజీ కార్పొరేటర్ నారాయణదాసు మారుతి, మెతుకు దేవరాజు, మేడి సదానందం, దొమ్మటి వాసు, కొలుగూరి సాయి కుమార్, నమ్మాబాద్ కిరణ్, ఇరుగురాల శ్రావణ్, ఈదునూరి శ్రీకాంత్, నూతి తిరుపతి, వెంకటేష్, హరికృష్ణ, రామ్ రాజు, కనకరాజు, అల్లం ఐలయ్యతో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణవేణి స్కూల్స్‌లో ఘనంగా ఆషాఢ మాస బోనాల మహోత్సవం





జ్యోతి నగర్, ఎన్‌టీపీసీ ఆగస్టు 8, పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని కృష్ణవేణి స్కూల్స్ గోదావరిఖని, ఎన్‌టీపీసీ క్యాంపస్‌లలో శనివారం ఆషాఢ మాస బోనాల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ మంజుల శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శోభాయాత్ర నిర్వహించి, అమ్మవారికి బోనాలు సమర్పించి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంజుల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఆషాఢ మాసంలో నిర్వహించే బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. అమ్మవారిపై భక్తి, సంస్కృతి, ఆచార వ్యవహారాలను భావితరాలకు పరిచయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థులు తెలంగాణ పండుగల విశిష్టతను తెలుసుకొని వాటిని ఆచరించాలని సూచించారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో బోనాలు సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తిగీతాలు, నృత్య ప్రదర్శనలు నిర్వహించగా విద్యార్థుల ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రాంగణం భక్తి, ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ ప్రిన్సిపాల్, ప్రిన్సిపాల్స్, పోషకులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, విద్యార్థులు, విద్యార్థినులు పాల్గొన్నారు. బోనాల మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించిన పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులను మంజుల శ్రీనివాస్ రెడ్డి అభినందించారు. విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.







# క్వార్టర్ లో ఉన్న కార్మిక కుటుంబాల కష్టాలు తీరేది ఎన్నడు?





- కోట్లు ఖర్చు చేస్తున్న పరిష్కారంకానీ డ్రైనేజీ సమస్యలు పట్టించుకోని అధికారులు
- తుమ్మల రాజారెడ్డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు8 పెద్దపల్లి జిల్లా అక్షర న్యూస్

తిలక్ నగర్ డౌన్ లోని సెక్టర్-2 ౨2-266 నెంబర్ క్వార్టర్ లో వర్షం వస్తే డ్రైనేజీ జామ్ అయి ఇళ్లలోకి నీరు వస్తుందని, ఎన్నిసార్లు సివిల్ డిపార్ట్మెంట్ అధికారులకు విన్నవించిన పరిష్కారం చూపడం లేదని, క్వార్టర్ లో ఉండలేకపోతున్నామని అర్జివన్ ఏరియా వర్క్ షాప్ లో టెండల్ పనిచేస్తున్న సంద్ర రాజమౌళి సిఐటియు నాయకులను సంప్రదించారు. ఈ మేరకు శనివారం తుమ్మల రాజారెడ్డి తో సిఐటియు బృందం అందరం వెళ్లి క్వార్టర్ ను పరిశీలించారు. క్వార్టర్ వెనకాల ఉన్న డ్రైనేజీ మొత్తం ఆక్రమించి ప్రైవేటు వ్యక్తులు ఇల్లు కట్టుకోవడం వల్ల ఆ డ్రైనేజీ జామ్ అయి క్వార్టర్ లోకి మురుగునీరు వస్తున్న పరిస్థితి ఉన్నది... వెంటనే అధికారులతో మాట్లాడి వెంటనే పనులు ప్రారంభించి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు... ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిపేర్ల పేరుతో సంవత్సరానికి కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న సింగరేణి యాజమాన్యం క్వార్టర్ లో ఉన్న కార్మిక కుటుంబాల సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు... ఈ కార్యక్రమంలో ఆర్జీవన్ అధ్యక్ష కార్యదర్శులు వంగల శివరామిరెడ్డి, మెండె శ్రీనివాస్, నంది నారాయణ, జంగపల్లి మల్లేష్, ముల్కల శ్రీకాంత్, కుటుంబ సభ్యులతో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

## 10న ఆర్‌సీఓఏ క్లబ్‌లో సామాజిక చైతన్య నాటికలు

జ్యోతి నగర్ ఎన్టిపిసి, ఆగస్టు 8 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ప్రజా సంబంధాల విభాగం ఆర్జీ-1 ఏరియా ఆధ్వర్యంలో అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ వారు విద్యా, సామాజిక చైతన్యంపై ప్రత్యేక నాటికల ప్రదర్శన నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం ఆగస్టు 10న సాయంత్రం 6.30 గంటల నుంచి 8 గంటల వరకు గోదావరిఖనిలోని ఆర్‌సీఓఏ క్లబ్‌లో జరగనుంది. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జీవిత విశేషాల ఆధారంగా 'సంఘం శరణం గచ్ఛామి', మహాత్మా జ్యోతిరావు పూలే జీవితాన్ని ఇతివృత్తంగా తీసుకుని 'సత్యశోధన' నాటికలను ప్రదర్శించనున్నారు. విద్య, అక్షరాస్యత, సమానత్వం, వ్యక్తిత్వ వికాసం, సామాజిక ఐక్యత, మానవ విలువలు, సామాజిక బాధ్యత వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ నాటికల ప్రధాన ఉద్దేశ్యమని సింగరేణి యాజమాన్యం తెలిపింది. నాటికల ద్వారా ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులతో పాటు ప్రజల్లో సామాజిక చైతన్యం పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. గోదావరిఖని పరిసర ప్రాంతాల ప్రజలు, అధికారులు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై నాటికలను వీక్షించాలని సింగరేణి యాజమాన్యం కోరింది.

## ఆర్జీ-1 పర్సనల్ మేనేజర్‌గా తిరుపతి బాధ్యతలు స్వీకరణ

జ్యోతి నగర్ ఎన్టిపిసి, ఆగస్టు 8 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్:




సింగరేణి ఆర్జీ-1 ఏరియా నూతన పర్సనల్ మేనేజర్‌గా రెడ్డిమల్ల తిరుపతి బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల సూపర్ బజార్ డివిజనల్ మేనేజర్‌గా పనిచేసిన ఆయన బదిలీపై ఆర్జీ-1 ఏరియాకు వచ్చారు. ఈ సందర్భంగా ఆర్జీ-1 ఏరియా స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు చెందిన రోవర్ స్కౌట్స్ ఆధ్వర్యంలో జనరల్ మేనేజర్ కార్యాలయంలో తిరుపతిని ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పర్సనల్ అధికారులు నాగుల వేణు, శ్రవణ్ కుమార్, ఫిరోజ్ ఖాన్, హనుమంతరావు, సంక్షేమ అధికారులు పాల్గొని నూతన పర్సనల్ మేనేజర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆర్జీ-1 స్కౌట్ మాస్టర్లు కుందూరు బుచ్చయ్య, దొడ్డి కుమార్, గుంటి కుమార్, అంజయ్య, సతీష్ వి దేవా చారి తదితరులు తిరుపతిని శాలువాతో ఘనంగా సన్మానించారు.

## విద్యార్థులకు భగవతీ హెల్పింగ్ హ్యాండ్స్ చేయూత

- 80 మంది విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 8 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : భగవతీ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో కుందనపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని మొగల్‌పహాడ్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 80 మంది విద్యార్థులకు ఐడీ కార్డులు, టైలు, బెల్టులు, నోట్‌బుక్కులు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భగవతీ హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు కంకటి రవి గౌడ్ మాట్లాడుతూ విద్య ఒకరి జీవితాన్ని మార్చే గొప్ప శక్తి అని అన్నారు. విద్యను అభ్యసించే క్రమంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు, లోటుపాట్లు ఉండకూడదనే ఉద్దేశంతో ఈ చిన్న సహాయం అందించినట్లు తెలిపారు. సామాజిక బాధ్యతలో భాగంగా పేద విద్యార్థులకు విద్యా సామగ్రి అందించడం అదృష్టంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మెతుకు సుభాషిణి మాట్లాడుతూ విద్యార్థులకు అందించిన సామగ్రి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, వారిలో నూతన ఉత్సాహాన్ని నింపుతుందని అన్నారు. విద్యార్థులకు అండగా నిలుస్తున్న భగవతీ హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పెట్టెం శ్రీనివాస్, బుద్ధె సతీష్, భూక్యా రవి నాయక్, కాంతాల రామచంద్రారెడ్డి, నస్పూరి రమేష్, దువాసి సాయి వినోద్‌తో పాటు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# శ్రీపాదరావు సేవలు చిరస్మరణీయం





- గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో చిత్రపటాలు ఏర్పాటు చేయాలి
- మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్

రామగిరి, పెద్దపల్లి జిల్లా ఆగస్టు 08 (అక్షరం న్యూస్):
రామగిరి మండలంలోని రత్నాపూర్ గ్రామంలో ఉన్న మంథని బ్లాక్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రొద్ద బాపన్న పటేల్ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ శాసనసభ స్పీకర్, స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాదరావు చిత్రపటాలను మంథని బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ గ్రామశాఖ అధ్యక్షులకు అందజేశారు. స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాదరావు ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు తండ్రి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్‌గా ఆయన ప్రజలకు విశిష్ట సేవలందించారని ఈ సందర్భంగా నాయకులు గుర్తుచేశారు. గ్రామశాఖ అధ్యక్షులు తమకు అందిన చిత్రపటాలను సంబంధిత గ్రామ పంచాయతీ కార్యాలయాలకు తీసుకెళ్లి, ఆయా గ్రామాల సర్పంచ్‌లకు అందజేయాలని తొట్ల తిరుపతి యాదవ్ సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీ కార్యాలయంలో శ్రీపాదరావు చిత్రపటాన్ని సగౌరవంగా ఏర్పాటు చేసి, ఆయన ప్రజా జీవితంలో అందించిన విశేష సేవలను భవిష్యత్ తరాలు స్మరించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలోని అన్ని గ్రామాల గ్రామశాఖ అధ్యక్షులు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి, పంచాయతీ కార్యాలయాల్లో చిత్రపటాలను గౌరవప్రదంగా ఏర్పాటు చేసేలా బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు ఎల్లే రామమూర్తి, కమాన్‌పూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎస్.ఎస్. అన్వర్, రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ ఓబీసీ అధ్యక్షులు బంధారి సదానంద్, ఎస్సీ సెల్ అధ్యక్షులు కండె పోషం, మాజీ సర్పంచ్ ఎరుకల ఓదేలు, తీగల సమ్మయ్య, పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు గొర్రె నరేష్ యాదవ్, ఉప సర్పంచ్‌లు, రామగిరి మండలంలోని అన్ని గ్రామశాఖల అధ్యక్షులు, కమాన్‌పూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అంబీర్ శీను తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ చొరవతో పెద్దపల్లి రైల్వే అభివృద్ధికి ముందడుగు

- రైల్వే బోర్డు చైర్మన్‌కు వినతిపత్రం.. జీన్స్ శ్రీనివాసు కృతజ్ఞతలు



జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 8 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్:
పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో రైల్వే ప్రయాణికుల సమస్యల పరిష్కారంతో పాటు రైల్వే అభివృద్ధికి మరింత ప్రాధాన్యత లభించేలా ఎంపీ గడ్డం వంశీకృష్ణ చొరవ తీసుకోవడం అభినందనీయమని రైల్వే బోర్డు మెంబర్ జీన్స్ శ్రీనివాసు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని రైల్వే సమస్యల పరిష్కారానికి సంబంధించి పలు కీలక డిమాండ్లతో రైల్వే బోర్డు చైర్మన్ సతీష్ కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు.
రైల్ భవన్‌లో రైల్వే బోర్డు చైర్మన్‌ను కలిసి పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని రవీంద్రఖని, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి రైల్వే స్టేషన్లలో ముఖ్యమైన సూపర్‌ఫాస్ట్ రైళ్లకు నిలుపుదల కల్పించాలని కోరినట్లు చెప్పారు. ఈ ప్రాంతాల ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు నిత్యం రైల్వేపై ఆధారపడుతున్నందున ప్రధాన రైళ్లకు నిలుపుదల కల్పిస్తే ఎంతో ప్రయోజనం కలుగుతుందని వివరించారు. అదేవిధంగా ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రోడ్డు వంతెనలు, కింది వంతెనల నిర్మాణాలను త్వరితగతిన చేపట్టాలని, రైల్వే కార్మికుల పిల్లల విద్యా అవసరాలను దృష్టిలో ఉంచుకుని రైల్వే పాఠశాలను ఏర్పాటు చేయాలని రైల్వే బోర్డు చైర్మన్‌ను కోరినట్లు తెలిపారు. ఎంపీ గడ్డం వంశీకృష్ణ చొరవతో నియోజకవర్గంలోని రైల్వే సమస్యలను కేంద్ర రైల్వే శాఖ దృష్టికి తీసుకెళ్లడం వల్ల రైల్వే అభివృద్ధికి మరింత మేలు జరిగే అవకాశం ఉందని జీన్స్ శ్రీనివాసు అన్నారు. ముఖ్యంగా రైళ్ల నిలుపుదల, వంతెనల నిర్మాణం, ప్రయాణికుల సౌకర్యాల మెరుగుదల వంటి అంశాలపై కేంద్రం దృష్టి సారిస్తే పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజల సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న ఎంపీ గడ్డం వంశీకృష్ణకు జీన్స్ శ్రీనివాసు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో రైల్వే అభివృద్ధికి ఎంపీ మరింత చొరవ చూపాలని ఆకాంక్షించారు.

## రజాకార్లను ఎదిరించిన పోరాటయోధుడు పండగ సాయన్న



సూర్యాపేట /నేరేడుచర్ల, ఆగస్టు 8:అక్షరం న్యూస్
నిజాం రజాకార్లు, భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి పేద ప్రజలకు అండగా నిలిచిన పోరాటయోధుడు పండగ సాయన్న అని బీఆర్ఎస్ నాయకుడు రాపోలు నవీన్ కుమార్ అన్నారు. శనివారం నేరేడుచర్ల మండలం దిర్శించర్ల గ్రామంలో పండగ సాయన్న జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన్ కుమార్ మాట్లాడుతూ పేద ప్రజలు ఆకలితో అలమటించకూడదనే ఉద్దేశంతో భూస్వాముల వద్ద ఉన్న ఆహార ధాన్యాలను తీసుకొచ్చి పేదలకు పంచిన మహనీయుడు సాయన్న అని కొనియాడారు. ఆకలితో ఉన్న గ్రామాల్లో సాయన్న అడుగుపెడితే పేదల కడుపు నింపి పండుగ వాతావరణం తీసుకొచ్చేవారని, అందుకే ఆయనకు 'పండగ సాయన్న' అనే పేరు వచ్చిందన్నారు. తుపాకీ ఎత్తి రజాకార్ల అన్యాయాలను ఎదిరించి బహుజనులకు అండగా నిలిచిన మహావీరుడు సాయన్న అని గుర్తుచేశారు. పండగ సాయన్న స్ఫూర్తితో భవిష్యత్ తరాలు ప్రజల కోసం పోరాడే తత్వాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పల్లెపంగు నాగరాజు, పంగ బుచ్చిబాబు, తకెళ్ల నాగార్జున, షేక్ నాగుల్ మీరా, కొప్పు గౌతమ్ గౌడ్, తురక వెంకటేశ్వర్లు, జొన్నలగడ్డ రాంనర్సయ్య, పటని వెంకటయ్య, నాగరాజు, పంగ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల మానవత్వం

- రోడ్డు ప్రమాద మృతుని కుటుంబానికి రూ.14,500 ఆర్థిక సహాయం
- చేయూతనిచ్చిన ఉపాధ్యాయ బృందానికి స్థానికుల అభినందన



రామగిరి, పెద్దపల్లి జిల్లా, ఆగస్టు 08 (అక్షరం న్యూస్):
కల్వచర్ల గ్రామానికి చెందిన మైలగాని కిరణ్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందారు. ప్రభుత్వ పాఠశాల వెనుక వైపునే ఆయన సొంత ఇల్లు ఉండటంతో పాటు, పాఠశాల పట్ల కిరణ్‌కు ప్రత్యేక అభిమానం ఉండేదని ఉపాధ్యాయులు తెలిపారు. ఆయన అకాల మరణంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కల్వచర్ల ఉపాధ్యాయ బృందం, సిబ్బంది తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కిరణ్ కుటుంబ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని మానవతా దృక్పథంతో ఉపాధ్యాయులు తమ వంతు సహాయాన్ని అందించారు. రూ.14,500 నగదును చెక్కు రూపంలో కీర్తిశేషులు మైలగాని కిరణ్ భార్య మైలగాని అనూషకు అందజేశారు. కష్టకాలంలో మృతుని కుటుంబానికి అండగా నిలిచి, మానవత్వాన్ని చాటుకున్న ఉపాధ్యాయ బృందాన్ని స్థానికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో జి.పి.హెచ్.ఎస్. ప్రధానోపాధ్యాయురాలు దేవళ్ల వనజతో పాటు గంట్ల రమాదేవి, ఆవిడపు రవి, కే. సత్యవతి, గుండేటి సత్యనారాయణ, గసిగంటి దేవేందర్, కే. శ్రీలత, మల్లారపు శంకర్, కే. సతీష్, ఎం.పి.పి.ఎస్. ప్రధానోపాధ్యాయులు ఆకుల శ్రీనివాస్, కే. వేణుగోపాల్, పి. కిష్టయ్య, ఎల్. పద్మావతి, దివ్యతో పాటు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రగతి పాఠశాలలో ఘనంగా బోనాల సంబురాలు

- సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థుల సందడి..
- కల్వచర్ల పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పణ



రామగిరి (పెద్దపెల్లి జిల్లా) ఆగస్టు 08 అక్షరం న్యూస్:
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రగతి పాఠశాలలో ఘనంగా శనివారం నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో ముస్తాబై వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా విద్యార్థులు భక్తిశ్రద్ధలతో బోనాలను తీసుకొని ఊరేగింపుగా కల్వచర్ల పోచమ్మ అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అక్కడ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించారు. తెలంగాణ సంస్కృతిలో బోనాల పండుగకు ఉన్న విశిష్టతను చాటేలా విద్యార్థులు సంప్రదాయబద్ధంగా వేడుకల్లో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ అబ్బు కేశవరెడ్డి మాట్లాడుతూ.. బోనాల పండుగ తెలంగాణ ప్రజల భక్తి, విశ్వాసాలకు ప్రతీక మాత్రమే కాకుండా మన సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పడుతుందని అన్నారు. అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలిచి ప్రజల ఆరోగ్యం, సుఖసంతోషాలు, పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని కోరుకోవడం బోనాల పండుగ ప్రత్యేకత అని తెలిపారు. విద్యార్థులకు విద్యతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించడం కూడా పాఠశాల బాధ్యతేనని పేర్కొన్నారు. పాఠశాల ఇంచార్జ్ కొప్పుల గోవర్ధన్ రావు మాట్లాడుతూ.. ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో మన సంప్రదాయాల పట్ల గౌరవం, ఐక్యతా భావం పెంపొందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక బృందం, తల్లిదండ్రులు, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాల పండుగ వేడుకలను విజయవంతం చేశారు. సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థుల సందడి, భక్తిశ్రద్ధలతో నిర్వహించిన బోనం సమర్పణ కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది.

## కల్తీ కల్లు విక్రయిస్తే కఠిన చర్యలు

- ఎల్లారెడ్డి ఎక్సైజ్ సీఐ: మొహమ్మద్ షాకీర్ అహ్మద్



కామారెడ్డి జిల్లా/ఎల్లారెడ్డి/ఆగస్టు 8/అక్షరంన్యూస్:కల్తీ కల్లు విక్రయిస్తే కఠిన చ ర్యలు తీసుకుంటామని ఎల్లారెడ్డి ఎక్సైజ్ సీఐ షాకీర్ అహ్మద్ హెచ్చరించారు. శనివా రం కామారెడ్డి జిల్లా ఎక్సైజ్ సూపరింటెం డెంట్ బి.ముకుందరెడ్డి ఆదేశాలమేరకు ఎ క్సైజ్ శాఖపరిధిలోనిలింగంపేట్, మండలం రాంపూర్, జల్దిపల్లి, కొండాపూర్ గ్రామాలలో ని కల్లు దుకాణాలనుఎక్సైజ్ సిబ్బందితో క లిసి ఆయన తనిఖీలునిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ 3 గ్రామాల్లోని 4 కల్లు దుకాణాలను తనిఖీలునిర్వహించి క ల్లు శాంపిల్స్ ను సేకరించి పరీక్షనిమిత్తం ని జామాబాద్ జిల్లా ల్యాబ్ కుపంపినట్లు తెలి పారు.పరీక్ష అనంతరం కల్లులోనిషేధిత మ త్తు పదార్థాలనువినియోగించినట్లు తేలితే కేసు నమోదుచేసి,అట్టి దుకాణాల లైసెన్స్ లనురద్దుచేసిసీజ్ చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ షాకీర్ అహ్మద్, హెడ్ కానిస్టేబుల్ శ్యామల, కానిస్టేబుల్ లు సురేష్, రాకేష్, అనిల్ తదితరులు పాల్గొ న్నారు.

## టాస్క్ ఆధ్వర్యంలోరాష్ట్రస్థాయి బహుమ తుల ప్రధానం

- టాస్క్ జిల్లా కన్వీనర్: డాక్టర్ బాలు



కామారెడ్డి జిల్లా/ఎల్లారెడ్డి/ఆగస్టు 8/అక్షరంన్యూస్:తెలంగాణ అధ్యయనసమా లోచన కేంద్రం(టాస్క్) ఆధ్వర్యంలో ప్రొఫెస ర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భం గానిర్వహించిన, వ్యాసరచన పోటీల విజే తలకు బహుమతులను ప్రదానం చేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విజేతలకు శని వారంసుందరయ్య విజ్ఞానకేంద్రంలో నిర్వ హించిన కార్యక్రమంలో,టాస్క్ రాష్ట్ర అధ్య క్షుడుఆరోజుశ్రీనివాస్ ఆధ్వర్యంలో సీనియ ర్ జర్నలిస్ట్ అల్లంనారాయణ, ఉస్మానియా యూనివర్సిటీ పూర్వఉపకులపతి రవీంద ర్ యాదవ్ ల చేతులమీదుగాబహుమతు లను ప్రదానంచేశారు.బహుమతులు అం దుకున్న వారిలో విజన్ జూనియర్ కళాశా ల,సాందీపని డిగ్రీ కళాశాలల విద్యార్థులు సిరి, చందన,ఫర్హానా బేగం, జీవిత, శ్రీ లేఖ లు ఉన్నట్లు టాస్క్ జిల్లా కన్వీనర్ డాక్టర్ బాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో టాస్క్ రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ వేద ప్రకాష్, అంబేద్కర్ యూనివర్సిటీ సహాయ ఆచా ర్యులు పడాల లక్ష్మణ్, నరేందర్ గౌడ్, రవీం దర్ తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్లకు దరఖాస్తుల ఆహ్వానం



జనగామ జిల్లా/ రఘునాథపల్లి / ( అక్షరం న్యూస్) ఆగస్టు 08: అర్హులైన వారి నుంచి చేయూ త పెన్షన్ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. మొదటి విడతగా ఒంటరి మహిళ, వితంతు, వికలాంగులు, చేనే త, గీత కార్మిక, డయాలిసిస్, ఫైలేరియా బాధితులు స్థానిక గ్రామపంచాయ తీలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇదివరకే దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. వితంతు పెన్షన్ కోసం 18ఏళ్ల పైబడి ఉండి భర్త మరణ ధ్రువీకరణ పత్రం, ఒంటరి మహిళ పెన్షన్ కోసం విడాకుల ఉత్తర్వు లేదా తహసీల్దార్ ధ్రువీకరణ పత్రం, విక లాంగులు సదరం ధ్రువీకరణ పత్రం, కల్లు గీత కార్మికులు 50 ఏళ్ల పైబడి ఉండి ఎక్సైజ్ శాఖ సహకార సంఘం జారీ చేసిన ఐడీ కార్డు, చేనేత కార్మి కులు 50 ఏళ్ల పైబడి ఉండి హ్యాండ్లూమ్స్, టెక్స్టైల్ శాఖ జారీ చేసిన గుర్తిం పు కార్డు, ఫైలేరియా, డయాలసిస్ బాధితులు సంబంధిత ప్రభుత్వ వైద్యాధి కారులు జారీ చేసిన దృవీకరణ పత్రాలను జతచేయాలని ఎంపీడీవో సూచించారు.

# వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగ అరెస్ట్

- పగటిపూట రెక్కీ.. రాత్రివేళ తాళాలు పగులగొట్టి చోరీలు
- కల్వచర్ల, ఓడేడు, రత్నాపురం సహా పలు ప్రాంతాల్లో దొంగతనాలు

రామగిరి, పెద్దపల్లి జిల్లా, ఆగస్టు 8 (అక్షరం న్యూస్): తాళం వేసి ఉన్న ఇళ్లను పగటిపూట రెక్కీ చేసి.. రాత్రివేళ తాళాలు పగులగొట్టి బంగారు ఆభరణాలు, నగదు దోచుకుంటున్న వరుస దొంగను రామగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. మంథని సీఐ బి.స్వామి ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం, రామగిరి పోలీసులు సంయుక్తంగా చేపట్టిన చర్యల్లో నిందితుడు వనం రాము(36) పోలీసులకు చిక్కాడు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శనివారం గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ మంథని సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

### పోలీసులకు చిక్కిన తీరు

ఆగస్టు 8న రామగిరి ఎస్సై టి.శ్రీనివాస్ తన సిబ్బందితో గస్తీ నిర్వహిస్తుండగా తాళం వేసి ఉన్న ఇళ్లను పరిశీలిస్తూ అనుమానాస్పదంగా తిరుగుతున్న రామును గుర్తించారు. పోలీసులను గమనించిన నిందితుడు అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. అతడిని తనిఖీ చేయగా ఒక బటన్ కత్తి లభించింది.

నిందితుడిని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించగా.. తాళం వేసి ఉన్న ఇళ్లలో దొంగతనాలు చేసేందుకు వచ్చినట్లు అంగీకరించడంతో పాటు గతంలో తాను, తన సహచరులతో కలిసి పాల్పడిన పలు చోరీల వివరాలను వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు.

### ఇలా చోరీలకు పాల్పడేవారు

జగిత్యాల జిల్లా తారక రామనగర్‌కు చెందిన వనం రాము గతంలో గ్రామాల్లో తిరుగుతూ తల వెంట్రుకలు సేకరించి విక్రయిస్తూ జీవనం సాగించేవాడు. ఆ ఆదాయం కుటుంబ పోషణకు సరిపోకపోవడంతో సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో దొంగతనాల బాట పట్టినట్లు ఏసీపీ తెలిపారు.

రాము తన భార్య కందెల అలియాస్ వనం కవితతో పాటు జగిత్యాల రామనగర్‌కు చెందిన దాసరి రవి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం మందలపల్లి గ్రామానికి చెందిన వనం పాపయ్య, అశ్వారావుపేటకు చెందిన తన తమ్ముడు వనం నగేష్‌లతో కలిసి చోరీలకు పాల్పడేవాడని వెల్లడించారు. పగటిపూట వివిధ వాహనాల్లో గ్రామాల్లో తిరుగుతూ తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి.. రాత్రి సమయంలో ఆయా ఇళ్లకు వెళ్లి తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడేవారని పోలీసులు తెలిపారు. గతంలో రాయికల్, జగిత్యాల ప్రాంతాల్లోనూ దొంగతనాలకు పాల్పడి జైలుకు వెళ్లి వచ్చినట్లు విచారణలో వెల్లడైంది.




### పలు ప్రాంతాల్లో వరుస చోరీలు

2025 అక్టోబర్ 10: కల్వచర్లలో తాళం వేసి ఉన్న ఇంటి తాళం పగులగొట్టి బంగారు ఉంగరాలు, కడియం, చెవి కమ్మలు, రూ.40 వేల నగదు దొంగిలించారు. అనంతరం ఓడేడు వైపు వెళ్తూ మరో ఇంట్లోకి చొరబడి బంగారు గాజులు, నల్లపూసల దండ, పెద్ద గొలుసు, మరో బంగారు గొలుసుతో పాటు రూ.లక్ష నగదు అపహరించారు. 2025 నవంబర్ 18: ముత్తారం ప్రాంతంలో ఓ ఇంట్లో చోరీకి ప్రయత్నించినా నగదు, ఆభరణాలు లభించలేదు. అనంతరం కల్వచర్లలో మరో ఇంటి కబోర్డ్ తాళం పగులగొట్టి రూ.15 వేల నగదు దొంగిలించారు. 2026 జనవరి 25: ధర్మారం మండలం దొంగతుర్తి గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంటి తాళం పగులగొట్టి బీరువాలోని బంగారు ఆభరణాలను చోరీ చేశారు. 2026 జనవరి 31: ఏూ 18 జ 8739 నంబర్ గల అద్దె బెలోనో కారులో కల్వచర్లకు వెళ్లి ఓ ఇంట్లో చోరీకి ప్రయత్నించినా నగదు, ఆభరణాలు లభించలేదు. 2026 ఫిబ్రవరి 6: ధర్మారం మండలం పత్తిపాకలో తాళం వేసి ఉన్న ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని వెండి, బంగారు ఆభరణాలను అపహరించారు. 2026 మార్చి 13: రత్నాపురంలో ఓ ఇంట్లోకి చొరబడి సుమారు 6 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు రూ.9,500 నగదును దొంగిలించారు. 2026 జూన్ 2: జూలపల్లి గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని బంగారు ఆభరణాలను దొంగిలించినట్లు నిందితుడు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.

### దొంగిలించిన బంగారం తాకట్టు.. విక్రయం

దొంగిలించిన ఆభరణాల్లో కొన్నింటిని జగిత్యాలలోని ముత్తూట్ ఫిన్‌కార్ప్‌లో తన పేరుతో తాకట్టు పెట్టినట్లు నిందితుడు విచారణలో వెల్లడించాడు. వాటి ద్వారా వచ్చిన డబ్బును ఎన్నికల సమయంలో ఖర్చు చేసినట్లు తెలిపాడు. మరికొన్ని బంగారు ఆభరణాలను జగిత్యాల టవర్ సర్కిల్‌లో నగల దుకాణం నిర్వహించే గంగారం అనే వ్యక్తికి విక్రయించినట్లు, అయితే అతను కొన్ని నెలల క్రితం మృతి చెందినట్లు పోలీసులకు చెప్పాడు. ఆభరణాల విక్రయం ద్వారా వచ్చిన డబ్బులో కొంత మొత్తాన్ని తన సహచరులైన రవి, పాపయ్య, నగేష్‌లకు ఇచ్చి.. మిగిలిన మొత్తాన్ని కుటుంబ ఖర్చులు, జల్సాలకు వినియోగించినట్లు వెల్లడించాడు.

అలాగే ఓడేడు గ్రామంలో దొంగిలించిన రూ.లక్షతో పాటు గతంలో చోరీ చేసిన నగదును కలిపి మొత్తం రూ.2 లక్షలను ఆంధ్రప్రదేశ్‌లోని జంగారెడ్డిగూడెంకు చెందిన జగన్నాథం లక్ష్మణరావు వద్ద సెప్టిక్ ట్యాంకర్ కొనుగోలు కోసం చెల్లించినట్లు తెలిపాడు.

ఇతర నిందితుల కోసం దర్యాప్తు నిందితుడి నుంచి మరిన్ని వివరాలు సేకరిస్తున్నామని ఏసీపీ ఎం.రమేష్ తెలిపారు. చోరీలకు సంబంధించిన ఆస్తి రికవరీతో పాటు ఇతర నిందితుల పాత్రపై కూడా దర్యాప్తు కొనసాగుతోందన్నారు. నిందితుడిని చాకచక్యంగా పట్టుకోవడంలో కీలకపాత్ర పోషించిన మంథని సీఐ బి.స్వామి, రామగిరి ఎస్సై టి.శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ భార్గవ్, పోలీస్ కానిస్టేబుళ్లు డి.రమేష్, వి.అభిషేక్, బి.రాజ్‌కుమార్‌లను ఏసీపీ ఎం.రమేష్ అభినందించారు.

# సింగరేణికి కొత్త బొగ్గు బ్లాక్‌ల కేటాయింపుపై హర్షం





- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపిన కందుల సంధ్యారాణి

జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 8 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌కు తాడిచర్ల బ్లాక్-2, పీకేఓసీ-2 డీప్‌సైడ్ బొగ్గు బ్లాక్‌లను కేటాయించడంపై బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. సింగరేణి సంస్థకు కొత్త బొగ్గు బ్లాక్‌ల కేటాయింపు సంస్థ భవిష్యత్ విస్తరణకు, బొగ్గు ఉత్పత్తి సామర్థ్యం పెంపునకు దోహదపడుతుందని సంధ్యారాణి పేర్కొన్నారు. ముఖ్యంగా పెద్దపల్లి జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి, స్థానికంగా ఉపాధి అవకాశాల పెంపునకు ఈ నిర్ణయం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. సింగరేణి సంస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు సంస్థ అభివృద్ధి ద్వారా ఈ ప్రాంత ఆర్థిక పురోగతికి కొత్త బొగ్గు బ్లాక్‌లు దోహదం చేస్తాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. తాడిచర్ల బ్లాక్-2, పీకేఓసీ-2 డీప్‌సైడ్ బొగ్గు బ్లాక్‌ల కేటాయింపునకు కృషి చేసిన కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కిషన్‌రెడ్డిని శాలువాతో సన్మానించి ధన్యవాదాలు తెలిపారు. కొత్త బొగ్గు బ్లాక్‌ల కేటాయింపు సింగరేణి సంస్థ చరిత్రలో కీలక ముందడుగుగా నిలుస్తుందని కందుల సంధ్యారాణి పేర్కొన్నారు.

# పెద్దంపేటలో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి.. ఏడుగురు అరెస్ట్





జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 8 పెద్దపల్లి జిల్లా అక్షర న్యూస్ : పెద్దంపేట గ్రామంలో డబ్బులు పందెంగా పెట్టి మూడు ముక్కల పేకాట ఆడుతున్న స్థావరంపై రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం దాడి చేసి ఏడుగురిని అరెస్ట్ చేశారు. నమ్మదగిన సమాచారం మేరకు రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాలతో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్ నేతృత్వంలో, ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలోని నార్కోటిక్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఈ దాడి నిర్వహించారు.

పేకాట ఆడుతున్న ధర్మాజీ లక్ష్మణ్ (53), , ఎన్టీపీసీకి చెందిన వ్యాపారి; లాయిశెట్టి మహేష్ (37), , పెద్దంపేటకు చెందిన డ్రైవర్; బంగారి నారాయణ (55), రామగుండానికి చెందిన రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి; ఆదిచర్ల శివ సాయి (47), , అంతర్గాంకు చెందిన పెయింటర్; మెరుగు వెంకటస్వామి (55), పెద్దంపేటకు చెందిన కూలీ; మాచర్ల ఆకాష్ (42), రామగుండానికి చెందిన పెయింటర్; ఆసర్ల మల్లేష్ (44) మంథనికి చెందిన కూలీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

వారి వద్ద నుంచి రూ.14,730 నగదు, 52 పేకముక్కలు, ఆరు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ఏడుగురిని, స్వాధీనం చేసుకున్న నగదు, పేకముక్కలు, సెల్‌ఫోన్లను తదుపరి కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యల కోసం అంతర్గాం పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.

## ఇందిరా మహిళా శక్తి భవనం పనులను వేగవంతం చేయాలి..

- సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్..



సూర్యాపేట టౌన్ జులై 8 అక్షరం న్యూస్

జిల్లా కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ఇందిరా మహిళా శక్తి భవనాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ శనివారం పరిశీలించారు. భవన నిర్మాణ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్న ఆయన, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మహిళల సాధికారత కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ భవనం అందుబాటులోకి వస్తే మహిళా సంఘాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. భవనానికి సంబంధించి మిగిలి ఉన్న బ్యాలెన్స్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సూచించారు. ముఖ్యంగా విద్యుత్ సరఫరా, తాగునీటి వసతి, పెయింటింగ్ మరియు ఫినిషింగ్ పనుల్లో ఎక్కడా జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు. నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ, గడువులోగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను, సంబంధిత శాఖా అధికారులను ఆదేశించారు. భవనం ప్రారంభమైతే జిల్లాలోని మహిళా సంఘాల కార్యకలాపాలకు, శిక్షణ కార్యక్రమాలకు వేదికగా మారుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ తనిఖీ కార్యక్రమంలో డిఆర్డిఓ సన్యాసయ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మైనర్లకు వాహనాలిస్తే కఠిన చర్యలు

- ఎస్ ఐ జ్యోతి



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /ఆగస్ట్ -08(అక్షరం న్యూస్ )

పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తతోపాటు బాధ్యతగా వ్యవహరించాలని ముస్తాబాద్ ఎస్ ఐ జ్యోతి అన్నారు. శనివారం ముస్తాబాద్ మండలం రామలక్ష్మణ పల్లి గ్రామ శివారులో ద్విచక్ర వాహనం నడుపుతున్న మైనర్ బాలుడి ని చూసి. ఆపారు. బాలునికి కౌన్సిలింగ్ చేశారు ఈ సందర్భంగా ఎస్ ఐ సరదా కోసం ద్విచక్ర లేదా ఇతర వాహనాలు నడిపితే ప్రమాదాలబారిన పడే అవకాశం ఉందన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమన్నారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వాహన యజమానులు, తల్లిదండ్రులపై కఠినమైన చర్యలు తీసుకోవడమే కాకుండా భారీ జరిమానా, జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వారికి వాహనాలు ఇవ్వొద్దని ఎస్ ఐ సూచించారు.

## ప్రభుత్వ బస్సు లీజ్ కు తీసుకోని ప్రాణాలతో చాలగటం

- బస్ లో పరిమితికి మించి ప్రయాణం
- అఖిల పక్షం ఆధ్వర్యంలో హెచ్చరిక



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /ఆగస్ట్ -08(అక్షరం న్యూస్ )

ప్రభుత్వ బస్సు లు లీజుకు తీసుకోని సామర్థ్యానికి మించి తీసుకెళ్తు మహిళ ల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ముస్తాబాద్ మండలం అవునూర్ గ్రామం లో గ్రామ అఖిల పక్ష నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ముస్తాబాద్ మండలం లోని నామపూర్, గూడెం, అవునూర్ తు ర్కపల్లి, తదితర గ్రామాల నుండి

అప్పిరియాల్ పార్క్ లో పని చేసే మహిళలను ఒకే బస్సు లో నిబంధనలకు విరుద్ధంగా 150మందిని తరలిస్తున్నారని ఆవునూర్ గ్రామ అఖిలపక్షం ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు కలిసి బస్సు ఆపి హేచ్చరించారు ఈ పరిస్థితి పునరావృతం కాకుండా చూసుకోవాలని అదనపు బస్సులు కేటాయించి మహిళలు సురక్షితశీగా చేరుకునేల చర్యలు తీసుకోవాలని బస్సు యాజమాన్యాన్ని హేచ్చరించారు. ఈ కార్యక్రమంలో లో బీజేపీ మండల అధ్యక్షులు సొల్ల క్రాంతి కుమార్, బీ ఆర్ ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు పొన్నాల పద్మారెడ్డి, దాసరి విశ్వనాథ్,కుమ్మరి అంజయ్య కనమెని శ్రీనివాస్ రెడ్డి,బోయిని రవి, పిట్ల రాజు, నక్కదాసరి దేవరాజు,నక్కల సుధాకర్ రెడ్డి,నక్కల మస్కట్ మల్లారెడ్డి పిట్ల చంద్రయ్య,నరేష్,గంగాడి శ్రీనివాస్ రెడ్డి గ్రామ పెద్దలు పాల్గొన్నారు ..

# రామగుండం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి..





- మంత్రులను కోరిన ఎమ్మెల్యే

జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 8 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

రామగుండం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర మంత్రులను రామగుండం శాసనసభ్యులు మక్కాన్సింగ్ ,నగర మేయర్ మహంకాళి స్వామి కోరారు . అభివృద్ధి పనుల పురోగతిపై ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజాప్రతినిధులు , జిల్లా కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులతో హైద్రాబాద్ సచివాలయం లో శనివారం మంత్రుల స్థాయిలో సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రులు శ్రీధర్ బాబు ,అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , తుమ్మల నాగేశ్వర రావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి ,పొన్నం ప్రభాకర్ లు నిర్వహించిన ఈ సమీక్షా సమావేశంలో రామగుండం శాసన సభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ తో పాటు నగర మేయర్ మహంకాళి స్వామి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామగుండం నగరానికి సంబంధించిన పలు సమస్యలను ప్రస్తావించడంతో పాటు ఎం ఎల్ ఏ రాజ్ ఠాకూర్ నేతృత్వంలో ఈ దిగువ చూపబడిన సమస్యలపై మంత్రివర్యులకు వినతి పత్రం కూడా సమర్పించినట్లు మేయర్ తెలిపారు.

రామగుండం నగరం గోదావరి నదికి సమీపంలో ఉండటం వలన వరదలు నివారించడానికి సింగరేణి సంస్థ ఓ బి మట్టి వినియోగించుకొని కరకట్ట నిర్మాణం చేయాలి.

గోదావరి పుష్కరాలు ప్రారంభం కావడానికి కొద్ది నెలలు మాత్రమే సమయం ఉన్నందున పుష్కరాలు జరుగుతున్న ప్రాంతాల్లో ప్రదాన రైలు మార్గం ఉన్న ఊరు రామగుండం కాబట్టి దేశవ్యాప్తంగా ప్రజలు కుంభ మేళా తరహాలో ఇక్కడికే వస్తారు . ఏర్పాట్ల భారం రామగుండం నగర పాలక సంస్థ పైనే పడుతుంది . కాబట్టి ఇప్పటికే ఎం ఎల్ ఎ ఆద్వర్యంలో రూ 150 కోట్లకు డి పి ఆర్ ఇవ్వడం జరిగింది..త్వరిత గతిన నిధులు మంజూరు చేస్తే నగర పాలక సంస్థ ద్వారా పనులు ప్రారంభించడం జరుగుతుంది

నగర పాలక సంస్థ కార్యాలయంలో ముప్పది ఏళ్ల క్రితం రెగ్యులర్ పబ్లిక్ హెల్త్ వర్కర్లు 85మంది ఉండగా ఇప్పుడు 37 మంది మాత్రమే ఉన్నారు .కాబట్టి ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయడానికి చర్యలు తీసుకోవాలి . అలాగే జనాభా ప్రాతిపదికన పబ్లిక్ హెల్త్ వర్కర్ల సంఖ్యను కూడా పెంచాలి

ఔట్ సోర్స్ సానిటేషన్ వర్కర్స్ లో ముసలి వాళ్ళు , అనారోగ్యం బారిన పడ్డ చాతకాని వాళ్ళు తమ కుటుంబంలో ఒకరికి తన ఉద్యోగం ఇవ్వండి అని అర్జీ పెట్టుకుశీటున్నారు. అదనంగా ఆర్థిక భారం పడనప్పుడు ముసలి వాళ్ళ ను , అనారోగ్యంతో ఉన్న ఔట్ సోర్స్ సిబ్బందిని యువకులతో రీ ప్లేస్ చేయడానికి ఆమోదం ఇస్తే అదనపు ఆర్థిక భారం ఏమీ పడకపోగా పని జరుగుతుంది. వాళ్ళకు కూడా న్యాయం జరుగుతుంది. విలీన గ్రామ పంచాయతీల నుండి వచ్చిన తాత్కాలిక కార్మికుల్లో కూడా చాలా మంది వృద్ధులే వున్నారు. వారికి కూడా వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇచ్చే అవకాశాలు పరిశీలించాలి.

రామగుండం నగర పాలక సంస్థ కు కొన్ని స్పెషల్ సానిటేషన్ వెహికిల్స్ ఉన్నాయి. వాటిని సాధారణ డ్రైవర్లు ఆపరేట్ చేయలేరు . కాబట్టి జె సి బి వంటి బ్యాక్ హో లోడర్ వాహనాలు నడపడానికి ఆపరేటర్లు కావాలి. కొత్తగా ఆపరేటర్లను ఔట్ సోర్స్ పద్ధతిన పెట్టుకోవడానికి అనుమతి ఇవ్వాలి.

రామగుండం నగర పాలక సంస్థ పరిధిలో ఉన్న సింగరేణి , ఎన్ టి పి సి సంస్థల సి ఎస్ ఆర్ నిధులను , డి ఎం ఎఫ్ టి నిధులను ఆయా కంపనీలకు భూములు ఇచ్చి, ఉపాధి కోల్పోయి , నిత్యం కాలుష్యాన్ని అనుభవిస్తున్న రామగుండం ప్రాంత ప్రజల కోసం ఖర్చు చేసేలా నగర పాలక సంస్థ ఖాతా లోనే జమ చేయాలి.

?సింగరేణి సంస్థ గత ఇరవై ఐదు ఏళ్లుగా అంటే ప్రాపర్టీ టాక్స్ వేయడం ప్రారంభమైనప్పటి నుండి ఒకే అమౌంట్ ప్రాపర్టీ టాక్స్ కడుతున్నారు. 2015 సంవత్సరం నుండి రివైజ్ చేస్తూ ఎన్ని సార్లు డిమాండ్ నోటీస్ పంపించినా పాత టాక్స్ మాత్రమే చెల్లిస్తున్నారు. సింగరేణి సి అండ్ ఎం డి కి తగు ఆదేశాలు జారీ చేసి రివైజ్డ్ టాక్స్ అమౌంట్ మొత్తం చెల్లించేలా చూడాలి. తద్వారా నగర పాలక సంస్థకు ఆదాయం పెరుగుతుంది.

?సింగరేణి,ఎన్ టి పి సి, ఆర్ ఎఫ్ సి ఎల్ కంపనీల దగ్గర వేల ఎకరాల ఖాళీ భూములున్నాయి. ఆ భూములకు సంబందించి వేకెంట్ ల్యాండ్ టాక్స్ చెల్లించేలా ఆయా కంపనీల యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేయాలి. తద్వారా నగర పాలక సంస్థకు ఆదాయం మెరుగుపడుతుంది.

ఎల్ ఆర్ ఎస్ : తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం ప్రకారం, 26.08.2020 నాటికి రిజిస్ట్రేషన్ పూర్తయిన అనధికారిక ప్లాట్లు/లేఅవుట్లను మాత్రమే క్రమబద్ధీకరించడానికి అర్హతగా నిర్ణయించారు. అయితే ఈ కటాఫ్ తేదీ ముగిసి దాదాపు ఆరేళ్లు గడుస్తున్నందున, ఆ తర్వాతి కాలంలో నగరాలు, పట్టణాలు విపరీతంగా విస్తరించాయి. జీవనోపాధి మరియు నివాస అవసరాల కోసం లక్షలాది మంది మధ్యతరగతి ప్రజలు 2020 ఆగస్టు తర్వాత కూడా ప్లాట్లను కొనుగోలు చేశారు. ఈ స్థలాలకు ఎల్ఆర్ఎస్ లేకపోవడంతో భవన నిర్మాణ అనుమతులు రావడం లేదు. దాంతో నగర పాలక సంస్థకు రావాల్సిన 'భవన నిర్మాణ అనుమతి ఫీజులు నిలిచిపోయాయి. అలాగే కొత్త లేఅవుట్ల క్రమబద్ధీకరణ జరగకపోవడం వల్ల ఓపెన్ స్పేస్ ఛార్జీలు, నాలా ఫీజులు, ఇతర అభివృద్ధి ఫీజుల రూపంలో మున్సిపాలిటీలకు రావలసిన రాబడి ఆగిపోయింది. దీనివల్ల రామగుండం మాత్రమే కాదు అన్ని మునిసిపాలిటీలు తీవ్ర ఆర్థిక లోటును ఎదుర్కొంటున్నాయి. కాబట్టి కటాఫ్ తేదీని 26.08.2020 నుండి ప్రస్తుత సంవత్సరానికి పొడిగించాలి.



ఇటీవల కురిసిన భారీ వర్షాలతో సింగరేణి , ఎన్ టి పీ సి , ఆర్ ఎఫ్ సి ఎల్ ప్రాంతాల నుండి వచ్చిన నీటి కారణంగా వరదలు వచ్చి చుట్టు ప్రక్కల ప్రాంతాలు మునిగిపోయాయి. కానీ మూడు నెలలు ముందుగా అప్రమత్తమై రామగుండం నగర పాలక సంస్థ కాలువల్లో పూడిక తీత పనులు నిర్వహించడంతో నగర పాలక సంస్థ పరిధిలోని ప్రాంతాలకు గతంలో లాగా వరద ముప్పు రాలేదు .కాబట్టి భవిష్యత్తులో వరద ముప్పు రాకుండా వరద కాలువల నిర్మాణం , వాటి నిర్వహణ విషయంలో చర్యలు చేపట్టవల్సిందిగా సింగరేణి , ఎన్ టి పి సి , ఆర్ ఎఫ్ సి ఎల్ యాజమాన్యాలకు రాష్ట్ర ప్రభుత్వం నుండి ఆదేశాలు జారీ చేయాలి.

నగరానికి విద్యుత్ సరఫరా చేసే ప్రదాన 33 కె వి లైన్లు ఎం ఆర్ ఓ ఆఫీస్ నుండి శారదా నగర్ సబ్ స్టేషన్ వరకు సుమారు 50 ఏళ్ల క్రితం సిమెంట్ పోల్స్ తో వేయడం జరిగింది. అయితే ఈ స్తంభాలు పూర్తిగా ఎన్ టి పి సి కాంపౌండ్ వాల్ లోపల వుండడం వలన మెయింటెనెన్స్ చేయడానికి అవకాశం లేక చుట్టూ చెట్లు , పొదలు పెరిగిపోయి అక్కడికి చేరుకోవడానికే ఇబ్బందిగా ఉన్నది. అంతేకాకుండా లైన్స్ , పోల్స్ జీవిత కాల పరిమితి కూడా ముగిసిపోయింది. చిన్న వర్షాలకు , ఈదురు గాలులకు సమస్య ఏర్పడి నగరమంతా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతున్నది. . కాబట్టి దాదాపు 12 కిలో మీటర్ల దూరం ఆధునిక టవర్ లైన్స్ వేయాల్సి ఉన్నది . ప్రస్తుత, భవిష్యత్ అవసరాల దృష్ట్యా కొత్త టవర్ లైన్ వేయుటకు ట్రాన్స్ కోకు ఆదేశాలు జారీ చేయాలి.

# త్వరలో అఖిల భారత యాదవ మహాసభ కమిటీల ఏర్పాటు.

- అఖిల భారత యాదవ మహాసభ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బండి సదానందం యాదవ్.

మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ ఆగస్టు 8/ అక్షరం న్యూస్-:

అఖిల భారత యాదవ మహాసభ మంచిర్యాల జిల్లా కమిటీలను త్వరలోనే ఏర్పాటు చేయనున్నట్లు అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షులు బండి సదానందం యాదవ్ తెలిపారు. శనివారం స్థానిక ప్రెస్ క్లబ్ లో సంఘం నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. జిల్లాలో ఉన్నటువంటి అన్ని మండలాల అధ్యక్షులు మున్సిపల్ టౌన్ ప్రెసిడెంట్ల తో ఏర్పాటు చేసి గతంలో వేసుకున్నటువంటి యాదవ సంఘం జిల్లా మండల కమిటీలను పరిశీలించి మళ్లీ రాష్ట్ర అధ్యక్షులు ఆదేశం మేరకు అతి త్వరలోనే జిల్లాలో ఉన్నటువంటి అన్ని మున్సిపాలిటీలు మండలాలు గ్రామాలకు సంబంధించిన యాదవ కమిటీలను ప్రకటిస్తామన్నారు. ఈ విషయాన్ని జిల్లాలో ఉన్నటువంటి యాదవులు అందరు గమనించాలని కోరుతూ రాబోవు రోజుల్లో యాదవుల హక్కుల కోసం యాదవుల సమస్యల కోసం రాష్ట్ర మంత్రివర్యులు వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ ఆశీస్సులతో జిల్లాలోని యాదవ భవనాలు యాదవ భవనంతో పాటు ఏ సమస్యలు ఉన్నగాని



వారి దృష్టికి తీసుకెళ్లి జిల్లాలో ఉన్న యాదవులు అందరికీ న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత యాదవ మహాసభ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు బండి సదానందం యాదవ్, జిల్లా యూత్ అధ్యక్షులు గంగాధర్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు అల్లంల పావన్న యాదవ్, అల్లంల నాగన్న యాదవ్,జన్నారం మండల ప్రెసిడెంట్ బొంతల మల్లేష్ యాదవ్,మందమర్రి టౌన్ ప్రెసిడెంట్ సిలివెరీ గోపాల్,మందమర్రి యూత్ అధ్యక్షులు కత్తెర్ల సంజీవ్, మందమర్రి వైస్ ప్రెసిడెంట్ సందనవేణి సంజీవ్ యాదవ్, రేణి సత్తన్న, అమరగాని ఐలయ్య, పిండి ఐలయ్య, కోట రాజన్న, మద్దూరి రాములు, కోట రాజన్న, కూకట్ల పోషం, నాగనవేణి కృష్ణ, మరియు జిల్లా మండల యాదవ సోదరులు పాల్గొన్నారు.

# కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగా సీతారాములు



భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / ఆగస్టు 8/ అక్షరం న్యూస్– : కొత్తగూడెం నియోజకవర్గం, లక్ష్మీదేవిపల్లి మండలం, మైలారం గ్రామపంచాయతీ వార్డు మెంబర్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీ బొబ్బాల రమేష్ శుక్రవారం నాడు ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌కు గురైన విషయం తెలిసిన వెంటనే టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ నాగా సీతారాములు తన బృందంతో కలిసి కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి రమేష్ ని పరామర్శించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ వైద్యులుతో మాట్లాడి రమేష్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన సీతారాములు, మెరుగైన వైద్యం అందించేందుకు పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. రమేష్ త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థించారు.

# హజ్ యాత్ర ముగించుకుని స్వదేశం చేరుకున్న హాజీ రంజాన్ ఖాన్ కు ఘనంగా సన్మానించి నయీమ్ ఖురేషి



భద్రాద్రి కొత్తగూడెం కొత్తగూడెం ఆగస్టు 8 అక్షరం న్యూస్–: శనివారం సౌదీ అరేబియా పవిత్ర మాక్క కు వెళ్లి హజ్ యాత్రను విజయవంతంగా ముగించుకొని స్వదేశానికి చేరుకున్న శుభ సందర్భంగా ప్రముఖ వ్యాపారవేత్త ఓల్డ్ డిపో మసీదు ఉపాధ్యక్షులు హాజీ రంజాన్ ఖాన్ కు రాష్ట్ర మైనార్టీ నాయకులు డా.నయీమ్ ఖురేషి ఆధ్వర్యంలో ఘన సన్మానం నిర్వహించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ యొక్క కార్యక్రమంలో ఉర్దూగర్ కార్యదర్శి ఎం డి. షరీఫ్, ఓల్డ్ డిపో మసీదు కార్యదర్శి ఎం.డి అప్సర్, ఎండీ సిరాజ్, ఎండీ.జాఫర్ ఖురేషి,

ఎం డి.జానీ, నజీర్ ఖాన్, ఎండీ మొయినుద్దీన్, ఫరీద్ ఇబ్రహీం, ఎండీ హుస్సేన్ ఖురేషి, ఎండీ గౌస్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

# ఎయిర్‌పోర్ట్ నిర్మాణంపై ప్రభుత్వాల నిర్లక్ష్యం తగదు

- **జనసేన పార్టీ తీవ్ర ఆగ్రహం.**




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ ములకలపల్లి/ ఆగస్టు 8/ అక్షరం న్యూస్:

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు మంజూరైన గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయ లోపం వల్ల ఏళ్లు గడుస్తున్నా పురోగతి లేకపోవడాన్ని జనసేన పార్టీ తీవ్రంగా ఖండించింది. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జ్ గడల శ్రీనివాసరావు ఆదేశాల మేరకు యువజన విభాగం నాయకుడు గరికె రాంబాబు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముగ్గురు మంత్రులు, ఎమ్మెల్యే ఉన్నప్పటికీ భూసేకరణ సాకుతో కాలయాపన చేయడం విడ్డూరమన్నారు. ఎయిర్‌పోర్ట్ ద్వారా భద్రాచలంతో పాటు మూడు రాష్ట్రాల ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగవుతాయని, గిరిజన యువతకు ఉపాధి, పారిశ్రామికాభివృద్ధి సాధ్యమవుతాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి త్వరితగతిన నిర్మాణం చేపట్టాలని, లేనిచో ప్రత్యక్ష పోరాటానికి దిగుతామని హెచ్చరించారు.



# సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలి

- **సెక్యూరిటీ ఆఫీసర్ వెంకటేశ్వర్ రెడ్డి కి ఐ. ఎన్.టి.యూ.సి వినతి పత్రం.**

మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ ఆగస్టు 8/ అక్షరం న్యూస్–:

మందమర్రి ఏరియా సింగరేణి సెక్యూరిటీ సంస్థలో ఉన్న పలు సమస్యలపై ఐ ఎన్ టి యు సి సెక్రెటరీ జనరల్ కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ డా జనక్ ప్రసాద్ కి తెలియజేయగా వారి ఆదేశాల మేరకు ఏరియా ఐ ఎన్ టి యు సి వైస్ ప్రెసిడెంట్ దేవి భూమయ్య ఆధ్వర్యంలో సెక్యూరిటీ ఆఫీసర్ వెంకటేశ్వర్ రెడ్డి కి కేంద్ర కమిటీ జాయింట్ సెక్రెటరీ జగన్నాథ చారి వినతి పత్రం అందజేశారు. సెక్యూరిటీ ఆఫీసర్ సానుకూలంగా స్పందించి పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సెక్యూరిటీ సంస్థలో ఉన్న సమస్యలను అతి త్వరలో పరిష్కరిస్తానని

# కొత్తగూడెంలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) తెలంగాణ రాష్ట్ర 4 వ మహాసభలు






భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / ఆగస్టు 8 / అక్షరం న్యూస్–: శనివారం కొత్తగూడెం లో జరిగిన ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా కమిటీ విస్తృత సమావేశంలో ఐలు రాష్ట్ర మహాసభలను నవంబర్ నెలలో కొత్తగూడెంలో నిర్వహించాలని నిర్ణయించటం జరిగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, ఎల్లందు, దమ్మపేట ల నుండీ 24 మంది జిల్లా కోర్టు కమిటీ సభ్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మహాసభలు మణుగూరులో నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమాశానికి ఐలు జిల్లా ఉపాధ్యక్షులు వెంకట నర్సయ్య అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిదులుగా ఐలు జిల్లా అధ్యక్షులు కొల్లి సత్యనారాయణ ప్రధాన కార్యదర్శి కే పార్థసారథి తెలంగాణ బార్ కౌన్సిల్ కు కొత్తగా ఎన్నికయిన తెలంగాణ రాష్ట్ర ఐలు మహిళా వింగ్ కన్వీనర్ చందాల శైలజ ఐలు నేషనల్ కౌన్సిల్ మెంబర్స్ ఏడునూతల శ్రీనివాసరావు జలసూత్రం శివరామ్ ప్రసాద్ పాల్గొన్నారు. ఇంకా ఈ సమావేశంలో ఐలు జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్ మక్కడ్, రాష్ట్ర కమిటీ కార్యదర్శి పొనుగోటి కిషన్ రావు ఐలు కొత్తగూడెం కోర్టు కమిటీ అధ్యక్ష కార్యదర్శులు రావిలాల రామారావు కిలారు పురుషోత్తం మణుగూరు కోర్టు కమిటీ అధ్యక్షుడు పోషం భాస్కర్ దమ్మపేట కోర్టు ఐలు బాధ్యులు వుండతానేని శ్రీనివాస రావు మారం సతీష్ కుమార్ ఐలు జిల్లా కమిటీ సభ్యులు అరికల రవి కుమార్ గడదేసి కాంతయ్య జి.అన్నపూర్ణ, టీ.సునంద, తెల్లబోయిన రమేష్, ఉప్పు అరుణ్, పిట్టల రామారావు, దూదిపాల రవికుమార్, మేదరమెట్ల శ్రీనివాస రావు, పద్మావతి శైలజ తదితరులు పాల్గొన్నారు.




# సనాతన ధర్మం -- నిత్యకల్యాణం పచ్చతోరణం





- **పురాతన శ్రీ అనంతపద్మనాభస్వామి ఆలయంలో అన్న సమర్పణ.**

రంగారెడ్డి :శంకర్పల్లి :ఆగష్టు 8: అక్షరం న్యూస్ :శంకర్‌పల్లి మండలంలోని మహాలింగాపురం--లింగయ్యగూడెం పరిధిలో ఉన్న పురాతన శ్రీశ్రీశ్రీ అనంతపద్మనాభస్వామి ఆలయంలో నిర్వహించిన అన్న సమర్పణ కార్యక్రమంలో బీజేపీ ఎండోమెంట్ సెల్ ధార్మిక రంగారెడ్డి జిల్లా రూరల్ జాయింట్ కన్వీనర్ ఆర్. సతీష్ కుమార్ (నరేష్ కుమార్) పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భోజనాన్ని కూర్చొని తినడం మన సనాతన సంప్రదాయంలో భాగమని, దీనివల్ల ఆరోగ్యపరమైన ప్రయోజనాలు కూడా ఉన్నాయని తెలిపారు. అలాగే "నిత్యకల్యాణం పచ్చతోరణం" అనే సంప్రదాయానికి అనుగుణంగా ఆలయాన్ని మామిడి ఆకులతో అలంకరించాలని సూచిస్తూ, స్వయంగా మామిడి ఆకుల తోరణాలను కట్టించారు. చిన్నారులు కూడా మన సనాతన సంప్రదాయాలను పాటించేలా బొట్టు పెట్టుకోవడం, సంప్రదాయాలను గౌరవించడం వంటి విషయాలను వారికి వివరించారు. మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహాలింగాపురం బిజెపి సీనియర్ నాయకులు మాజీ వైస్ ఎంపీపీ శ్రీ కృష్ణారెడ్డి , ఎన్ నరసింహారెడ్డి, ఆలయ పూజారి నర్సింలు, శివ ఫౌండేషన్ సభ్యులు సి నరసింహ రెడ్డి, మహిళా భక్తులు గ్రామస్తులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ములకలపల్లిలో ఎమ్మెల్యే జారే ఆకస్మిక తనిఖీలు





- **నాణ్యతలో లోపాలుంటే చర్యలు తప్పవు ఎమ్మెల్యే జారే.**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ ములకలపల్లి/ ఆగస్టు 8/ అక్షరం న్యూస్:

ములకలపల్లి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కె జి బి వి), సోషల్ వెల్ఫేర్ రేసిడెన్షియల్ స్కూల్ ఒ కళాశాల, మరియు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పి హెచ్ సి) అశ్వారావుపేట శాసనసభ్యులు శ్రీ జారే ఆదినారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ముందుగా కేజీబీవీ ని సందర్శించిన ఎమ్మెల్యే విద్యార్థినులతో ముచ్చటించి, కాసేపు తరగతి గదిలో పాఠాలు బోధించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని చదువుల్లో రాణించాలని సూచించారు. అనంతరం సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో మెస్ ను పరిశీలించి, భోజన నాణ్యతపై ఆరా తీశారు. నిర్దేశిత మెనూ ప్రకారం పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన పౌష్టికాహారాన్ని విద్యార్థులకు అందించాలని, నాణ్యతలో లోపాలు ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. చివరగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పి హెచ్ సి) తనిఖీ చేసి, రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వ విద్యా, వైద్య లక్ష్యాలను నీరుగార్చవద్దని అధికారులకు, యాజమాన్యానికి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## డయాబెటిస్‌తో మతిమరుపు...

డయాబెటిస్ అనేది పెనుభూతంగా మారిన సంగతి తెలిసిందే. భారతదేశంలోనూ షుగర్ వ్యాధిగ్రస్థుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. కడుపు నిండా ఏది తిందామన్నా రక్తంలో షుగర్ లెవల్స్ ఎక్కడ పెరిగిపోతాయోననే భయం వారిని వెంటాడుతూనే ఉంది. అందుకే భోజనం విషయంలో అనేక జాగ్రత్తలు తీసుకుంటుంటారు. లెక్కలేసుకుని మరీ ఎంత తినాలో అంతే తింటుంటారు. అలాగే షుగర్‌తో వచ్చే ఇతర ఆరోగ్య ప్రమాదాల గురించీ ఎంతో అప్రమత్తంగా ఉంటుంటారు. అలాంటి డయాబెటిస్ రోగులకు మరో షాకింగ్ న్యూస్. వారికి మతిమరుపు వచ్చే ప్రమాదం పొంచి ఉందని తాజా అధ్యయనం చెబుతోంది. బోస్టన్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రముఖ డాక్టర్ జెన్నిఫర్ వీవ్ నేతృత్వంలో చేసిన తాజా అధ్యయనంలో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి.

డయాబెటిస్ రోగులకు డిమెన్షియా(మతిమరుపు) వచ్చే ప్రమాదం ఉందని ఆ అధ్యయనంలో తేలింది. సాధారణ వ్యక్తుల కంటే వీరికి ఈ వ్యాధి వచ్చే ప్రమాదం మూడు రెట్లు అధికంగా పొంచి ఉందని జెన్నిఫర్ తెలిపారు. సుమారు 2.83లక్షల మందిపై సుదీర్ఘ అధ్యయనం చేసి ఈ విషయాన్ని కనుగొన్నట్లు చెప్పారు. దీనికి సంబంధించిన వివరాలను అమెరికన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీకి చెందిన న్యూరాలజీ పత్రికలో ప్రచురితమయ్యాయి. టైప్–1 డయాబెటిస్ ఉన్నవారికి భవిష్యత్తులో మతిమరుపు వ్యాధి వచ్చే అవకాశం 3 రెట్లు అధికంగా ఉందని.. టైప్–2 డయాబెటిస్ వచ్చే వారికి ఈ ముప్పు 2 రెట్లు అధికంగా ఉందని అధ్యయనం చెబుతోంది. సాధారణ వ్యక్తులకు అంటే డయాబెటిస్ లేని వారిలో కేవలం 0.6 శాతం మందికి మాత్రమే డిమెన్షియా రాగా.. టైప్–1 బాధితుల్లో 2.6శాతం మందికి వచ్చినట్లు గణాంకాలు చెబుతున్నాయి. టైప్–1 డయాబెటిస్ మొత్తం డయాబెటిస్ కేసుల్లో 5 శాతమే అయినా.. మెదడుపై చాలా ప్రభావం చూపిస్తుందని జెన్నిఫర్ చెబుతున్నారు.

## జైల్ భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయండి - ప్రజాసంఘాల నాయకులు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి / ఆగస్టు 8 / అక్షరం న్యూస్–;

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, క్విట్ ఇండియా స్ఫూర్తితో ఈనెల 10న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన ప్రజాసంఘాల విస్తృత సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశంలో టీయూసీఐ జిల్లా నాయకులు నూపా భాస్కర్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ముదిగొండ రాంబాబు, ఏఐటీయూసీ మండల నాయకులు కందిమల్ల నాగరాజు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల పొట్ట కొట్టేలా కార్పొరేట్ అనుకూల విధానాలను అవలంబిస్తోందని ధ్వజమెత్తారు. దేశ సంపదను లూటీ చేసి కొందరి పెట్టుబడిదారులకు దోచిపెట్టేలా నూతన చట్టాలను రూపొందిస్తున్నారని మండిపడ్డారు. స్నేహపూర్వక వాణిజ్య ఒప్పందం పేరుతో అమెరికా నుంచి వ్యవసాయ ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడం ద్వారా మన దేశ సంపదను విదేశాలకు తరలిస్తున్నారని ఆరోపించారు. కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్, ఇతర ప్రజా వ్యతిరేక విధానాలను రద్దు చేసేవరకు పోరాటాలు ఆగవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోర్స రామకృష్ణ, నిమ్మల మధు, రామారావు, వెంకటేశ్వర్లు, నాగేశ్వరావు, రామ్మూర్తి, రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎక్కాల్లో దుమ్మురేపుతున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థి

### 1897వ ఎక్కాన్ని సైతం అలవోకగా చెప్పేస్తున్న 5వ తరగతి బాలుడు

### గణిత ప్రతిభకు అబ్బురపడుతున్న ఉపాధ్యాయులు, గ్రామస్థులు



భద్రాద్రి కొత్తగూడెం /అశ్వారావుపేట /ఆగస్టు 8/అక్షరం న్యూస్ :- చిన్న వయస్సులోనే సంక్లిష్టమైన గణిత ఎక్కాలను అలవోకగా చెప్పేస్తూ ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఓ విద్యార్థి అందరినీ అబ్బురపరుస్తున్నాడు. అశ్వారావుపేట మండలం తిరుమలకుంట గ్రామానికి చెందిన కోసూరి సత్తిబాబు-- సౌజన్య దంపతుల చిన్న కుమారుడు కె. శ్యామ్ స్థానిక మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ స్కూల్ (ఎంపీయూపీఎస్)లో 5వ తరగతి చదువుతున్నాడు.

**1897వ ఎక్కం సైతం తడబాటు లేకుండా..**

సాధారణంగా చిన్నారులు 10, 20 వరకు ఎక్కాలను గుర్తుపెట్టుకోవడానికే ఇబ్బంది పడుతుంటారు. అయితే శ్యామ్ మాత్రం ఏకంగా 1897వ ఎక్కాన్ని ఎలాంటి తడబాటు లేకుండా వరుసగా చెప్పేస్తూ తన ప్రతిభను చాటుతున్నాడు. అంతేకాకుండా 1897ను 3, 7 వంటి సంఖ్యలతో గుణించి అడిగినా క్షణాల్లో సరైన సమాధానాలు చెబుతున్నాడు.

**జ్ఞాపకశక్తితో ఆకట్టుకుంటున్న బాలుడు**

శ్యామ్ గణిత ప్రతిభతో పాటు అతడి జ్ఞాపకశక్తి కూడా ఉపాధ్యాయులను, గ్రామస్థులను ఆకట్టుకుంటోంది. క్లిష్టమైన ఎక్కాలను సైతం సులభంగా గుర్తుంచుకుని చెప్పడం అతడి ప్రత్యేకతగా నిలుస్తోంది.

**ప్రధానోపాధ్యాయుడి అభినందనలు**

శ్యామ్ ప్రతిభను పాఠశాల ప్రధానోపాధ్యాయులు బానోత్ బాలాజీ అభినందించారు. చిన్న వయస్సులోనే గణితంలో అసాధారణ ప్రతిభ కనబరుస్తున్న శ్యామ్‌ను మరింతగా ప్రోత్సహించాలని ఆకాంక్షించారు. విద్యార్థి ప్రతిభను చూసిన ఉపాధ్యాయులు, గ్రామస్థులు సైతం అభినందనలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ ఇంతటి ప్రతిభను కనబరుస్తున్న శ్యామ్‌కు ప్రభుత్వం, విద్యాశాఖ నుంచి తగిన ప్రోత్సాహం అందిస్తే భవిష్యత్తులో గణిత రంగంలో మరింత ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశం ఉందని ఉపాధ్యాయులు, గ్రామస్థులు ఆకాంక్షిస్తున్నారు.

## ఎన్టీపీసీ లేబర్ గేట్ వద్ద రోడ్డు ప్రమాదం

- **ఆటో బస్సును ఢీకొని ఐదుగురికి తీవ్ర గాయాలు**

జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 8 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

రామగుండం ఎన్టీపీసీ నంబర్–2 లేబర్ గేట్ సమీపంలోని రాజీవ్ రహదారిపై శనివారం రోడ్డు ప్రమాదం జరిగింది. రహదారి పక్కన నిలిపి ఉంచిన బస్సును వెనుక నుంచి వేగంగా వచ్చిన ఆటో ఢీకొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. కరీంనగర్ నుంచి గోదావరిఖని వైపు వెళ్తున్న బస్సు ప్రయాణికులను దించేందుకు ఎన్టీపీసీ నంబర్–2 లేబర్ గేట్ వద్ద రహదారి పక్కన ఆగింది. అదే సమయంలో పెద్దపల్లి నుంచి గోదావరిఖని వైపు వేగంగా వస్తున్న ఆటో అదుపుతప్పి నిలిపి ఉన్న బస్సును వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ ఎండీ షబ్బీర్‌తో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న మహానందు, చందు, మల్లవ్వ, గట్టమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే అంబులెన్స్‌కు సమాచారం అందించి, క్షతగాత్రులను గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను పరిశీలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వేగమే ప్రమాదానికి కారణమా, మరేదైనా కారణం ఉందా అనే కోణంలో పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

## చిన్నారుల భవిష్యత్తుకు భరోసా అత్యాధునిక అంగన్వాడీ కేంద్రం ప్రారంభోత్సవం






భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ ములకలపల్లి/ ఆగస్టు 8/ అక్షరం న్యూస్:

ములకలపల్లి మండలం ధర్మన్ననగర్ గిరిజన ప్రాంతంలో శనివారం పండుగ వాతావరణం నెలకొంది. డైనటా సంస్థ సీఎస్ఆర్ నిధులు, సమారిటన్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన కంటెయినర్ అంగన్వాడీ కేంద్రాన్ని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు వందన గౌడ్ ఘనంగా ప్రారంభించారు. గొత్తికోయ సోదరులు సాంప్రదాయ నృత్యాలతో అతిథులకు స్వాగతం పలికారు. ఇదే వేదికపై తల్లిపాలవారోత్సవం నిర్వహించి లబ్ధిదారులకు ప్రయోజనాలు అందజేశారు. ?మారుమూల చిన్నారులకు పౌష్టికాహారం, ప్రాథమిక విద్య అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుంజా రవి, మాజీ జడ్పీటీసీ బత్తుల అంజి, మాజీ సర్పంచ్ కారం సుధీర్, నాయకులు సుమిత్, వంశీ, తిరుపతి రెడ్డి, పీడీ, సీడీపీవో తదితరులు పాల్గొన్నారు.

### మాదారంలో కలకలం.. సెలవు రోజున

## జీపీ ఆఫీస్ తాళాలు తీసిన బయటి వ్యక్తి



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా / ములకలపల్లి / ఆగస్టు 8 / అక్షరం న్యూస్ –:

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలంలోని మాదారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సెలవు దినమైన రోజు విచిత్ర ఘటన చోటుచేసుకుంది. ఎలాంటి అధికారమూ లేని ఒక బయటి వ్యక్తి ఉదయం జీపీ కార్యాలయ తాళాలు తీయడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ప్రభుత్వ కార్యాలయ రికార్డులకు, ఆస్తులకు రక్షణ కరువైందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సెలవు రోజున బయటి వ్యక్తికి ఆఫీస్ తాళాలు ఎలా ఇచ్చారని, దీని వెనుక గ్రామ కార్యదర్శి నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని స్థానికులు మండిపడుతున్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు వెంటనే విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



## ఘనంగా పణితి సైదులు జన్మదిన వేడుకలు..





ఖమ్మం జిల్లా/వైరా టౌన్ ఆగస్టు 8( అక్షరం న్యూస్)

వైరా మున్సిపాలిటీ ఏడవ వార్డు కౌన్సిలర్ పణితి సైదులు పుట్టినరోజు వేడుకలు పలు చోట్ల ఘనంగా నిర్వహించబడ్డాయి ..దార సుధాకర్ జన్మదిన వేడుకలు కూడా నిర్వహించబడ్డాయి . వైరా మున్సిపాలిటీ ఏడో వార్డులో జరిగిన జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ డాక్టర్ సెల్ జిల్లా అధ్యక్షులు కాపా మురళీకృష్ణ , వైరా టౌన్ అధ్యక్షులు వీరంశెట్టి సీతారాములు , డాక్టర్ శ్యాం బాబు , చెరుకూరి శ్రీను




సరుపూడి కోటేశ్వరరావు పనితి వెంకటేశ్వర్లు పనితి నాగార్జున బండి సైదులు పనితీపుల్లయ్య పనితీ అబ్బాసు కాంద్ర శ్రీను అల్లు బుజ్జిబాబు షేక్ అక్బర్ సల్మాన్ సాయి గిరి కోపూరి నాగేశ్వరరావు అనుమోలు సైదులు ఆనంద్ ఉదయ్ మనీ అశోక్ సురేష్ విజయ్ గణేష్ తదితరులు పాల్గొన్నారు. ప్రజలతో మమేకమై, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, వార్డు అభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్న పణితి సైదులు కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. ఆ య ు ర ా ర ో గ ్య ా ల ు, సుఖసంతోషాలు, మరెన్నో విజయాలు కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటామన్నారు.





## ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుందాం

- క్విట్ ఇండియా ఉద్యమస్ఫూర్తితోఆగస్టు 10నజరిగే జైల్ భరోను జయప్రదం చేద్దాం.
- నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలి.
- సిఐటియు జిల్లా అధ్యక్షుడు: చంద్రశేఖర్



కామారెడ్డి జిల్లా/ ఎల్లారెడ్డి/ ఆగస్టు8/ అక్షరంన్యూస్: కామారెడ్డి జిల్లా కేంద్రంలో శనివారం సిఐటియుఆధ్వర్యంలోఆగస్టు 10న జరిగే జైలు భరో కార్యక్రమాన్ని జయ ప్రదం చేయాలని కరపత్రాల విడుదలకార్య క్రమాన్నినిర్వహించారు. ఈ సందర్భంగా సి ఐటియు జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ మా ట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్లను రద్దుచేయాలని, ప్రభుత్వ రం గ సంస్థలు బ్యాంక్, రైల్వేస్,పోస్టల్ ,టెలికం, సింగరేణి, విమానాయా తదితర సంస్థల ను ప్రైవేటీకరణ చేయకూడదని అన్నారు. ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించాల నీ,మందులపైన ప్రభుత్వాలు విధించిన ప న్నులన్నింటిని తక్షణమేరద్దు చేయాలనే డిమాండ్ల సాధనకై క్విట్ ఇండియాఉద్యమ స్ఫూర్తితో దేశవ్యాప్తంగా ఆగస్టు 10న జరి గే జైలు భరో నిరసన కార్యక్రమంలో భాగం గా కామారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగే నిరసన లో జిల్లాలో ఉన్న అన్ని రకాలకార్మికులు,ఉ ద్యోగులు, రైతులు, వ్యవసాయ కార్మికులు ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కో రారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజ నర్సు, సత్యం గ్రామపంచాయతీ జిల్లా అ ధ్యక్షులు బాల్నర్సు అంగన్వాడి యూనియ న్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఇందిరా, బా బాయ్ ,లక్ష్మి, సవిత, ఆశా యూనియన్ నా యకులు ఇందిరా, రాజశ్రీ, మమత, మున్సి పల్ యూనియన్ నాయకులు ఆయాజ్, మొహమ్మద్, సంతోష్,నర్సింగ్ రావు, ప్రభు, ఏడారపు రాజు,దీవెన, శివ,రాజవ్వ,మధ్యా హ్నా భోజనకార్మిక సంఘం నాయకులు వెం కటేష్, కిష్టగౌడ్,దుర్గయ్య, ప్రమీల,హమాలి సంఘం నాయకులు,బిల్డింగ్ వర్కర్స్ నా యకులు సాయిబాబా, ఈశ్వర్, తదితరు లు పాల్గొన్నారు.

## అల్లుడు, అల్లుడి కుటుంబ సభ్యుల వేధింపులతో రైతు ఆత్మహత్య



కరీంనగర్/వీణవంక/ ఆగస్టు 08/అక్షరం న్యూస్:

కూతురి కాపురం కోసం బ్రతిమలాడి అవమానం ఎదుర్కొన్న తండ్రి మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు. పూర్తి వివరాల్లోకి వెళితే వీణవంక మండలం చల్లూరు గ్రామానికి చెందిన రైతు రామిడి సంతోష్ రెడ్డి (57) తన కూతురు రజితను 2012లో అదే గ్రామానికి చెందిన లంబు శ్రవణ్ కుమార్ కు ఇచ్చి వివాహం చేశారు. వివాహ సమయంలో అప్పట్లో 1.20 ఎకరాల భూమి, బంగారం కట్నంగా ఇచ్చారు.అయితే అదనపు కట్నం కోసం అల్లుడు, అతని తల్లిదండ్రులు వేధిస్తున్నారని, దీంతో కూతురు 3 ఏళ్లుగా పుట్టింట్లోనే ఉంటోందని కుటుంబం పేర్కొన్నారు.జులై 29న పంచాయతీలోనూ, ఆగస్టు 3న మళ్లీ బ్రతిమలాడేందుకు వెళ్లినా అల్లుడి కుటుంబం దూషించి అవమానించిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో మనస్తాపానికి గురైన సంతోష్ రెడ్డి పురుగుల మందు తాగి ఆత్మహత్య కు పాల్పడ్డాడని గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక హుజురాబాద్ ఆస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తీసుకెళ్లగా చికిత్స పొందుతూ ఆగస్టు 7న మృతి చెందినట్టు తెలిపారు. భార్య వెంకటవ్వ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఎస్ ఐ ఆవుల తిరుపతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఆగస్టు 10న కరీంనగర్‌లో జరిగే జైలు భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- సిపిఎం మండల కార్యదర్శి జక్కుల రమేష్



కరీంనగర్/జమ్మికుంట/ఆగస్టు 08/అక్షరం న్యూస్:

రైతు , సీఐటీయూ, వ్యవసాయ కార్మిక,సంఘాల దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఈ నెల 10న కరీంనగర్‌లో నిర్వహించనున్న జైలు భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ సిపిఎం పార్టీ జమ్మికుంట మండల కమిటీ కార్యదర్శి జక్కుల రమేష్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీల హక్కులను కాలరాస్తూ ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఆగస్టు 10న కరీంనగర్‌లో జరిగే జైలు భరో కార్యక్రమంలో రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు భారీ సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక పంపాలని అయన పిలుపునిచ్చారు. సిపిఎం పార్టీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని ప్రత్యక్షంగా పోరాటాలలో పాల్గొంటుందని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు దండిగారి సతీష్, వడ్లూరి కిషోర్, కన్నం సదానందం, రావుల ఓదెలు, కోక్కర్లమహేష్, సారయ్య,శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు ఉల్లంఘిస్తే ఇక ఉపేక్షించేది లేదు..

- మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపైనా కేసులు
- త్రిబుల్ రైడింగ్, శబ్ద కాలుష్య సైలెన్సర్లపై పోలీసుల నజర్
- వాహనదారులు బాధ్యతగా వ్యవహరించాలి
- వైరా ఏసీపీ సారంగపాణి

ఖమ్మం జిల్లా/ వైరా టౌన్ ఆగస్టు 8 (అక్షరం న్యూస్)

వైరా: రహదారి భద్రత విషయంలో వాహనదారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రమాదాల బారిన పడటమే కాకుండా చట్టపరమైన చర్యలు కూడా ఎదుర్కోవాల్సి ఉంటుందని వైరా ఏసీపీ సారంగపాణి హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి వాహనదారుడి బాధ్యత అని స్పష్టం చేశారు. శనివారం వైరా రింగ్‌రోడ్డు వద్ద ఏసీపీ సారంగపాణి ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర, ఇతర వాహనాలను తనిఖీ చేసి హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్, నంబర్ ప్లేట్ తదితర అంశాలను పరిశీలించారు.

### మైనర్ల చేతికి వాహనాలు ఇవ్వొద్దు..

మైనర్లు ద్విచక్ర వాహనాలు నడపడం ప్రమాదకరంగా మారుతోందని ఏసీపీ పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లలపై నిఘా ఉంచాలని, వారికి వాహనాలు ఇవ్వకుండా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. మైనర్ వాహనం నడుపుతూ ప్రమాదానికి గురైతే తల్లిదండ్రులు కూడా చట్టపరమైన చర్యలు ఎదుర్కొనే పరిస్థితి ఉంటుందని హెచ్చరించారు.



### త్రి బు ల్ రై డి ం గ్.. ప్ర మా దా ల కు ప్రధాన కారణం

ద్విచక్ర వాహనాలపై ముగ్గురు ప్రయాణించడం వల్ల వాహనంపై నియంత్రణ కోల్పోయే ప్రమాదం ఉంటుందని పోలీసులు తెలిపారు. ముఖ్యంగా యువత సరదా కోసం ట్రిపుల్ రైడింగ్‌కు పాల్పడుతూ తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా ప్రమాదంలోకి నెట్టవద్దని సూచించారు.

### మోత మోగించే సైలెన్సర్లపై చర్యలు

వాహనాల కంపెనీ సైలెన్సర్లను తొలగించి అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లు అమర్చడం వల్ల ఇతర వాహన దారులు, పాదచారులకు ఇబ్బందులు కలుగుతున్నాయని పోలీసులు పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా సైలెన్సర్లు మార్చే వారిపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### నంబర్ ప్లేట్ లేకుంటే అనుమానమే

ప్రతి వాహనానికి తప్పనిసరిగా నంబర్ ప్లేట్ ఉండాలని ఏసీపీ తెలిపారు. నంబర్ ప్లేట్ లేకుండా లేదా స్పష్టంగా కనిపించకుండా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు, నేరాల సమయంలో వాహనాలను గుర్తించడం కష్టమవుతుందని పేర్కొన్నారు.

### హెల్మెట్.. ప్రాణాలకు రక్షణ కవచం

హెల్మెట్ ధరించడం కేవలం పోలీసుల తనిఖీల నుంచి తప్పించుకోవడానికి కాదని, ప్రమాద సమయంలో ప్రాణాలను కాపాడుకునేందుకు అని ఏసీపీ సారంగపాణి సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా నాణ్యమైన హెల్మెట్ ధరించాలని కోరారు. రోడ్డుపై కొద్దిసేపటి నిర్లక్ష్యం జీవితాంతం కుటుంబాన్ని విషాదంలోకి నెట్టే అవకాశం ఉందని, అందుకే ప్రతి ఒక్కరూ "నా భద్రత.. నా కుటుంబ భద్రత" అనే బాధ్యతతో వాహనాలు నడపాలని ఏసీపీ సూచించారు. ఈ కార్యక్రమంలో వైరా సీఐ వెంకటప్రసాద్, ఎస్ఐ పుష్పాల రామారావుతో పాటు పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ట్రాఫిక్ రూల్స్ పాటిద్దాం.. ప్రమాదాలను నివారిద్దాం..






- హెల్మెట్, తప్పనిసరిగా ధరించాలి..
- వైరా ఏసిపి సారంగపాణి

ఖమ్మం జిల్లా/ వైరా టౌన్ ఆగస్టు 8 (అక్షరం న్యూస్)

సమాజంలో ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటించి రోడ్డు ప్రమాదాలను నివారించాలని వైరా ఏసిపి సారంగపాణి పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా వైరా రింగ్ రోడ్ సెంటర్ లో పోలీస్ చెక్ పోస్ట్ వద్ద వైరా ఏసిపి సారంగపాణి సిఐ వెంకట ప్రసాద్, ఎస్సై పుష్పాల రామారావు వాహనాలు తనిఖీ శనివారం నిర్వహించారు. హెల్మెట్లు ఇలాంటి పత్రాలు లైసెన్సులు లేకుండా తిరుగుతున్న 50 బైకులను స్వాధీనం చేసుకొని వాహనదారులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏసిపి సారంగపాణి మాట్లాడుతూ

రోడ్డుపై ప్రయాణం చేసేటప్పుడు తప్పనిసరిగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనం నడపాలన్నారు. అదేవిధంగా మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు.

అ తి వే గ ం



ప్రమాదకరమని ప్రతి వాహనదారుడు సిగ్నల్స్ పాటించి ప్రమాదాలను నివారించాలని కోరారు.

అనంతరం ద్విచక్ర వాహనాలపై. కార్లలో

వివిధ వాహనాలలో వెళ్తున్న డ్రైవర్లకు క్షేమంగా వెళ్లాలని ఏసిపి సూచించారు. ప్రయాణాలు చేసేటప్పుడు కుటుంబ సభ్యులను. బాధ్యతలను గుర్తుంచుకోవాలని జాగ్రత్తగా నడపాలన్నారు. మానవ తప్పిదాలు వల్లే అధికప్రమాదాలు జరుగుతున్నాయని యువత రోడ్డు భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ వెంకటప్రసాద్, ఎస్సై పుష్పాల రామారావు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## జైల్ భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

- శీలం అశోక్ తెలంగాణ రైతు సంఘం, జిల్లా సహాయ కార్యదర్శి

కరీంనగర్/జమ్మికుంట/ఆగస్టు 8/అక్షరం న్యూస్:

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 10న జరిగే జైల్ బరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శీలం అశోక్ పిలుపునిచ్చారు. శనివారం రోజున కరపత్రాన్ని ఆవిష్కరించి, పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ అఖిల భారత కిసాన్ సభ (ఏఐ కేఎస్), అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ( ఏఐ ఏడబ్ల్యూ), సిఐటియు అఖిలభారత పిలుపుమేరకు నాటి భారత క్విట్ ఇండియా స్వాతంత్ర ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న దేశవ్యాప్తంగా జైల్ భరో కార్యక్రమంలో వేలాదిగా కార్మికులు రైతులు వ్యవసాయ కూలీలు జైల్ భరో కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి జిల్లావ్యాప్తంగా గ్రామాల్లో విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జమ్మికుంట పట్టనంలోఆగస్టు 10 జైల్ భరో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అన్ని వర్గాల ప్రజలు, కార్మికులు, కర్షకులు, కూలీలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులకు వ్యతిరేకంగా 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చిందని విమర్శించారు. ఈ లేబర్ కోడ్స్ అమలైతే ఎనిమిది గంటల పనిదినం స్థానంలో 12 గంటల పనిదినం అమలయ్యే ప్రమాదం ఉందని, కనీస వేతనాల



హక్కు బలహీనపడుతుందని, స్కీం వర్కర్లకు శాశ్వత ఉద్యోగ అవకాశాలు దెబ్బతింటాయని, కార్మికులు సంఘాలు ఏర్పాటు చేసుకునే హక్కు కూడా హరించబడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల నాలుగు లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేసి పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని మరింత బలోపేతం చేసి కొనసాగించాలని, కార్పొరేట్ అనుకూల విధానాలను, చట్టాలను సవరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కోశాధికారి బాసిర సంపత్ రావు, మండల అధ్యక్షులు కాయిత లింగారెడ్డి, మరియు రైతు నాయకులు సిరికొండ పోచయ్య, సిరికొండ మధునయ్య, మారపల్లి కిరణ్, సల్ల సంపత్, జై మల్లేష్, పి రాజేందర్, జి రాజు, లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భద్రాచలం కార్యవర్గం

- ఐటిసి యూనిట్ హెడ్ శైలేంద్రసింగ్ ని కలిసి
- ధన్యవాదాలు తెలుపుతూ, సమర్పించిన వినతి పత్రం..



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ భద్రాచలం ఆగస్టు 8 (అక్షరం న్యూస్)

తలసేమియా, సికిల్సెల్ ఎనిమియా రక్తహీనత వ్యాధిని అరికట్టుటకు ఐటిసి పిఎస్పిడి యూనిట్ హెడ్ శైలేంద్రసింగ్ వ్యాధి నిర్ధారణ పరికరములను అందజేసేందుకు సానుకూలంగా స్పందించారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తలసేమియా, సికిల్సెల్ ఎనిమియా రక్త హీనత ఎక్కువగా ఉందని, ఇది తల్లిదండ్రుల నుంచి పిల్లలకు సంక్రమిస్తుందని, వ్యాధితో బాధపడుతున్న వారికి ప్రతి 21 రోజులకు రక్తం ఎక్కించాల్సిన అవసరం ఉంటుందని, ఆ వ్యాధులను నివారించుటకు ఐటిసి పిఎస్పిడి ద్వారా వ్యాధి నిర్ధారణ పరికరములు గడిచిన 4 సంవత్సరాలు ఏడాదికి రూ.5లక్షల ఖర్చుతో మొత్తం రూ.20లక్షలు వెచ్చించి వ్యాధి నిర్ధారణ పరికరములు అందజేసినారని, దీని ద్వారా ఎంతో మంది పేద ప్రజలకు మేలు జరిగిందని, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భద్రాచలం కార్యవర్గం ఐటిసి యూనిట్ హెడ్ శైలేంద్రసింగ్ ని కలిసి వారికి ధన్యవాదాలు తెలుపుతూ, వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా 2026-27 సంవత్సరమునకు రూ. 5లక్షల వ్యయంతో, 1800 వ్యాధి నిర్ధారణ పరికరాలు అందించవలసిందిగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కన్వీనర్ డా" ఎస్ఎల్ కాంతారావు కోరారు.. అదే విధంగా గిరిజన సంక్షేమం, తలసేమియా, సికిల్సెల్ ఎనిమియా రక్త హీనత వ్యాధిని అరికట్టుట కొరకు జిల్లా కలెక్టర్ అంకిత్ ఐఏఎస్ ఐటిసి బిపిఎల్ వారిని కోరారు.ఈ సూచనలకు ఐటిసి యూనిట్ హెడ్ శైలేంద్రసింగ్ వెంటనే సానుకూలంగా స్పందించి 2026-27 సంవత్సరానికి రూ. 5లక్షల వ్యయం కానున్న, 1800 వ్యాధి నిర్ధారణ పరికరాలు అందజేస్తామని తెలిపారు. వారికి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యవర్గం ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్ డా"ఎస్. ఎల్.కాంతారావు, పాకాల దుర్గా ప్రసాద్, జి.రాజారెడ్డి, వై. సూర్యనారాయణ, బి. వెంకటరెడ్డి, వి.కామేశ్వరరావు, సిద్దారెడ్డి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పచ్చని భద్రాచలమే లక్ష్యం..

- సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/భద్రాచలం ఆగస్టు 8 (అక్షరం న్యూస్)

భద్రాచలం పట్టణాన్ని పచ్చని వనంగా తీర్చిదిద్దే లక్ష్యంతో గ్రీన్ భద్రాద్రి--భద్రాచలం ఆధ్వర్యంలో చేపడుతున్న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు అభినందనీయమని భద్రాచలం సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ అన్నారు. పట్టణంలో పచ్చదనం పెంపొందించేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మొక్కలు నాటడం, వాటి సంరక్షణకు కృషి చేయడం ప్రశంసనీయమన్నారు.గ్రీన్ భద్రాద్రి--భద్రాచలం ఆధ్వర్యంలో శనివారం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రీ కనకదుర్గమ్మ ఆలయం వద్ద మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, గౌరవ అతిథిగా భద్రాచలం సర్పంచ్ పునేం కృష్ణదొర హాజరై మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ భద్రాచలం వంటి పవిత్ర పుణ్యక్షేత్రాన్ని మరింత పచ్చదనంతో, ఆహ్లాదకరమైన వాతావరణంతో తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతగా స్వీకరించాలని అన్నారు.భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే విస్తృతంగా మొక్కలు నాటి సంరక్షించాల్సిన అవసరం ఉందని సర్పంచ్ పునేం కృష్ణదొర అన్నారు. గ్రీన్ భద్రాద్రి చేపడుతున్న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను అభినందిస్తూ ప్రజలందరూ సహకరించాలని కోరారు.కార్యక్రమంలో గ్రీన్ భద్రాద్రి సెక్రటరీ రంజిత్ నాయక్, కోశాధికారి ఉప్పాడ రామ్ ప్రసాద్ రెడ్డి, పూర్వ అధ్యక్షులు డా. గోళ్ల భూపతిరావు, కామిశెట్టి కృష్ణార్జునరావు, డా. శివరామకృష్ణ, వీరయ్య, సంపత్, ఆలయ పూజారి విశ్వనాథం, కార్‌స్టాండ్ అధ్యక్షుడు, సభ్యులు పాల్గొన్నారు. వృక్ష ప్రేమికులు, గ్రీన్ భద్రాద్రి సభ్యులు, దాతలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు."వృక్షో రక్షతి రక్షితః" అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించారు. ప్రకృతిని ప్రేమిద్దాం.. మొక్కలను నాటుదాం.. భవిష్యత్ తరాలను కాపాడుదాం అని నిర్వాహకులు పిలుపునిచ్చారు.



## మాజీ డిప్యూటీ స్పీకర్ మధుసూదనాచారిని

# కలిసిన విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు..





ఖమ్మం జిల్లా/తల్లాడ ఆగస్టు 8 (అక్షరం న్యూస్)

తెలంగాణ శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారిని ఖమ్మం జిల్లా విశ్వబ్రాహ్మణ జర్నలిస్ట్ సంఘం ప్రధాన కార్యదర్శి మరియు ఖమ్మం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. హైదరాబాద్‌లోని అసెంబ్లీ హాల్‌లో ఖమ్మం జిల్లా విశ్వబ్రాహ్మణ జర్నలిస్ట్ సంఘం ప్రధాన కార్యదర్శి రుద్రాక్ష నరసింహ చారి ఖమ్మం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు గంటల వెంకటాచారి అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణుల సంక్షేమం, ఎదుర్కొంటున్న పలు సమస్యలపై మాజీ డిప్యూటీ స్పీకర్‌తో వారు చర్చించారు.

ఈ కార్యక్రమంలో ప్రముఖ నాయకులు తుమాటి రామారావు సతీమణి శ్రీదేవి కూడా పాల్గొని, మాజీ డిప్యూటీ స్పీకర్ మధుసూదనాచారిని శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సమావేశంలో విశ్వబ్రాహ్మణ సంఘానికి చెందిన పలువురు ప్రతినిధులు, ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# సంక్షేమ హాస్టల్స్ సమస్యలు పరిష్కరించాలి........





- పి డి ఎస్ యు
- సమయపాలన పాటించని వార్డెన్ విష్ణు పై చర్యలు తీసుకోవాలి
- వైరా బీసీ బాయ్స్ హాస్టల్ నూతన భవనాన్ని ఏర్పాటు చేయాలి.....
- మెనూ ప్రకారం విద్యార్థులకు మంచి ఆహారాన్ని అందించాలి.....

ఖమ్మం జిల్లా/ వైరా టౌన్ ఆగస్టు 8 (అక్షరం న్యూస్)

శనివారం పిడిఎస్యు ఆధ్వర్యంలో వైరా లోని బిసి సంక్షేమ కళాశాల హాస్టల్స్ ను సందర్శించడం జరిగింది. విద్యార్థులతో కలిసి భోజనం చేయడం జరిగింది... సమయపాలన పాటించని వార్డెన్ విష్ణు పై చర్యలు తీసుకోవాలి. ఈ సందర్భంగా పి డి ఎస్ యు అధ్యక్షులు జి మస్తాన్ పాల్గొని మాట్లాడుతూ వైరా సంక్షేమ హాస్టల్ బిసి కాలేజ్ హాస్టల్ వార్డెన్ విష్ణుపై చర్యలు తీసుకోవాలని ఉందా అధికారులను డిమాండ్ చేశారు .తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర సంవత్సరాలు కావస్తున్న సంక్షేమ హాస్టల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వైరా లోని బిసి సంక్షేమ హాస్టల్స్ అనేక సమస్యలతో విద్యార్థులు ఎదుర్కొంటున్న సరిగా గదులు లేక వానస్తే చుట్టూ అర్థమయమం మోకాలు లోతు నీళ్లు పోతున్న పరిస్థితిలో కనపడతా ఉంది విద్యార్థులకు ప్రాణ నష్టం జరిగే ఉన్నదని వారు అన్నారు. కళాశాల బాయ్స్ హాస్టల్ సుమారు 30 పైగా విద్యార్థులు అందులో నివసిస్తున్నారు. సరిగా సరిపోను కదులు లేక విద్యార్థుల ఇబ్బందులు పడుతున్న సంబంధించిన అధికారులు పట్టించుకోకుండా నిమ్మక నిరంతంగా వ్యవహరిస్తున్నారు మరోపక్క ప్రజాపాలన అంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులను మోసం చేస్తున్న రేవంత్ సర్కార్ వైరా ఎమ్మెల్యే

ఈ నియోజకవర్గంలో విద్యారంగ సమస్యలను హాస్టల్ సమస్యలను ఏమి పట్టించుకోకుండా ఉన్న పరిస్థితి ఇక్కడ ఉన్నది తక్షణమే బిసి బాయ్స్ వసతిగృహానికి నూతన భవనాన్ని ఏర్పాటు చేయాలని వారి కోరారు. కానీ జిల్లా అధికారులు రాష్ట్ర ప్రభుత్వం ఏమి పట్టించుకోకుండా పక్కదారి పట్టిస్తూ కాలయాపన చేస్తున్నారు. ఇప్పటికైనా శిథిల వ్యవస్థలో ఉన్న వసతి గృహాలకు మైనార్ రిపేరింగ్ నిధులను విడుదల చేయాలి విద్యార్థులకు రావాల్సిన స్కాలర్షిప్లో ఫేసు రియన్స్ మెంట్ విడుదల చేయాలి వీటిని విడుదల చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది విద్యార్థులు సర్టిఫికెట్లు తీసుకోవాలంటే పెండింగ్లో ఉన్న ఫీజులుకడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని మరోపక్క ప్రైవేట్ యజమాన్యం విద్యార్థులని విద్యార్థి తల్లిదండ్రులను ఇబ్బంది పెడుతున్నారు వైరా నియోజకవర్గంలోని అనుమతులు లేకుండా నడిపిస్తున్న పాఠశాలలో కళాశాలపై చర్యలు తీసుకోవాలి వాటిని గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాం సంక్షేమ హాస్టల్స్ సమస్యలు పరిష్కరించని యెడల పిడిఎస్యు విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో వైరా ఎమ్మెల్యే కార్యాలయాన్ని ముట్టడిస్తాం అని వారువిరాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాం....ఈ కార్యక్రమంలో పిడిఎస్యు జిల్లా కమిటీ సభ్యులు శ్రీకాంత్ విశ్వాంత్ మండల నాయకులు మనోజ్ పా ష సాయి పాల్గొన్నారు..

## జమ్మికుంట పట్టణంలో పిరియాడిక్ లేబర్

# ఫోర్స్ సర్వే ప్రజలు సర్వేకు సహకరించాలి






- ఉమ్మడి జిల్లా గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్

కరీంనగర్/ జమ్మికుంట/ఆగస్టు 08/అక్షరం న్యూస్: జాతీయ గణాంక శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న లిలిపిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పి ఎల్ ఎఫ్ ఎస్ --2026)లో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని జమ్మికుంట పట్టణంలో సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.ఈ సందర్భంగా జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, మేనేజర్ జి. రాజిరెడ్డి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సుధ గోని రామకృష్ణ గౌడ్ లను వారి కార్యాలయాల్లో కలిసి సర్వేకు సంబంధించిన కరపత్రాలను అందజేశారు. సర్వే లక్ష్యాలు, ప్రాముఖ్యతను వివరించారు.దేశంలో ఉపాధి, నిరుద్యోగం, కార్మిక శక్తి భాగస్వామ్యం, స్వయం ఉపాధి తదితర అంశాలకు సంబంధించిన విశ్వసనీయమైన గణాంకాలను రూపొందించేందుకు ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు.సర్వేలో మొదటి దశలో కుటుంబాల సాధారణ వివరాలను నమోదు చేసిన అనంతరం, ఎంపికైన కుటుంబాలను మూడు నెలల పాటు ప్రతి నెలా ఒకసారి సందర్శించి మొబైల్ ట్యాబ్ ద్వారా సమాచారాన్ని సేకరిస్తామని తెలిపారు.కుటుంబ సభ్యుల విద్యార్హతలు, విద్యాభ్యాసం, వృత్తి విద్య, ఉద్యోగం, స్వయం ఉపాధి, రోజువారీ కూలి పనులు, పని చేసిన గంటలు, వేతన వివరాలు, మహిళల ఆదాయ వనరులు తదితర వివరాలను నమోదు చేస్తామని పేర్కొన్నారు. అలాగే జొమాటో, స్విగ్గీ, రాపిడో, ఓలా, ఉబెర్ వంటి డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా పనిచేస్తున్న గిగ్ మరియు ప్లాట్‌ఫారమ్ కార్మికుల వివరాలను కూడా సేకరిస్తామని తెలిపారు.ఈ సర్వే ద్వారా సేకరించిన సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచబడుతుందని, గణాంకాల రూపకల్పనకు మాత్రమే వినియోగిస్తామని ఆయన తెలిపారు. ప్రజలు ఎలాంటి సందేహాలు లేకుండా సరైన సమాచారాన్ని అందించి సర్వే విజయవంతం కావడానికి సహకరించాలని గుర్రం శ్రీనివాస్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ మాచర్ల రాజు గౌడ్, బిల్ కలెక్టర్ గుంటి సాయికృష్ణ, మెప్మా సెక్షన్ సిబ్బంది బండి రజిత, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## హుజురాబాద్ బీసీ గురుకులలో ఘనంగా బోనాల వేడుకలు



కరీంనగర్/హుజురాబాద్/ఆగస్టు 08/అక్షరం న్యూస్: హుజురాబాద్ పట్టణంలోని మహాత్మ జ్యోతిబాపూలే బీసీ గురుకుల బాలికల పాఠశాల లో తెలంగాణ రాష్ట్ర పండుగ బోనాల వేడుకను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థినిలు సాంప్రదాయ దుస్తుల్లో బోనాలు ఎత్తుకొని అమ్మవారికి పూజలు చేశారు. పాఠశాల ఆవరణం మొత్తం భక్తిశ్రద్ధలతో జాతర వాతావరణంతో నిండిపోయింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ టి .శారద మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర పండుగైన బోనాలను పాఠశాల ఆవరణంలో నిర్వహించి అమ్మవారికి బోనం సమర్పించామని పసుపు కుంకుమ వేపాకులతో అలంకరించిన బోనాలను ఎత్తుకొని ఉపాధ్యాయులు, విద్యార్థినిలు చేసిన ఊరేగింపు ప్రత్యేకంగా ఉందని తెలంగాణ సంస్కృతిలో ఆడబిడ్డలకు ఉన్న ప్రాధాన్యతను చాటుతూ ఈ వేడుకను పాఠశాలలో నిర్వహించడం తెలంగాణ సంస్కృతిని, సాంప్రదాయాలను విద్యార్థులకు తెలిసే విధంగా నిర్వహించామని ప్రిన్సిపల్ అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ టి.శారద, ఏటీపీ నాగరాణి, బి డబ్ల్యు నీరజ, కే రజిత, పి రజిత, విద్యార్థినిలు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



## గ్రామీణ ప్రాంత ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడమే మా లక్ష్యం





- ఆదిత్య, అమృత హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్
- ఎలుక దేవేందర్ రెడ్డి,
- వల్బాపూర్‌లో ఉచిత వైద్య శిబిరం

కరీంనగర్/వీణవంక/ఆగస్టు 08/అక్షరం న్యూస్:

వీణవంక మండలం వల్బాపూర్ గ్రామ ప్రజలకు నాణ్యమైన కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జమ్మికుంట ఆదిత్య అమృత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో శనివారం గ్రామపంచాయతీ ఆవరణలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామ సర్పంచ్ అందే శ్రీమతి-కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నకిలీ, కల్తీ ఆహార పదార్థాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతిరోజూ తగినంత మంచినీరు తీసుకోవడంతో పాటు ఆకుకూరలు, కూరగాయలను ఉడికించి తీసుకోవాలని, సమతుల్య ఆహారానికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ భరత్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ గ్రీష్మ మాట్లాడుతూ కార్బోహైడ్రేట్లు అధికంగా ఉండే ఆహార పదార్థాల వినియోగాన్ని తగ్గించి, పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. నిత్యం వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. జంక్ ఫుడ్ అధికంగా తీసుకోవడం వల్ల యువతలో ఊబకాయం పెరుగుతోందని, బరువును నియంత్రించుకోవడం ముఖ్యమని తెలిపారు. ఆదిత్య ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ ఎలుక దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ సమాజ సేవలో బాలవికాస సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. సంస్థ సహకారంతో పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఆదిత్య, అమృత ఆసుపత్రుల ఆధ్వర్యంలో గతంలో అనేక వైద్య శిబిరాలు నిర్వహించి ఉచిత పరీక్షలు, మందులు అందించామని, భవిష్యత్తులోనూ ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొని తమ వంతు సహకారం అందిస్తామని గ్రామీణ ప్రాంత ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించడమే మా లక్ష్యం అని అన్నారు. తమ స్వగ్రామమైన వల్బాపూర్ ప్రజలకు ఆసుపత్రిలో ఉచిత ఓపీ సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఉప సర్పంచ్ నామని విజేందర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామంలో మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. జమ్మికుంట బాలవికాస సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన మాట్లాడుతూ ప్రతి మహిళ ఆరోగ్యంపై అవగాహన పెంచుకుని ఇంటిని ఆరోగ్యానికి తొలి కేంద్రంగా మార్చాలని సూచించారు. బాలవికాస కార్యక్రమాలు నిర్వహిస్తున్న 14 సెంటర్ల పరిధిలోని 180 గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు సుమారు రూ.2 కోట్ల విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఆయా సెంటర్ల పరిధిలోని దాతల సహకారంతో ఈ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలవికాస కోఆర్డినేటర్ స్వాతి, కరోబార్ రాజశేఖర్, పాలకవర్గ సభ్యులు, ఆదిత్య ఆసుపత్రి పీఆర్వోలు రఫిక్, శ్రీకాంత్, దుర్గాప్రసాద్, ఆసుపత్రి సిబ్బంది అనిల్‌రావు, మహేష్, శ్రావణ్, రంజిత్, పూజ, అనూష, శృతి తదితరులతో పాటు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాష్ట్ర అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కు 10 పతకాలు..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా / ఆగస్టు 8( అక్షరం న్యూస్)

తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో , హన్మకొండ, జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో నిన్నటితో ముగిసిన రాష్ట్ర జావెలిన్ డే అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అథ్లెట్లు ప్రతిభ కనబర్చి మొత్తం 10 పతకాలు సాధించారని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కే. మహీధర్ తెలిపారు. ఈ పోటీల్లో జిల్లా క్రీడాకారులు నాలుగు బంగారు, నాలుగు రజత, రెండు కాంస్య పతకాలు గెలుచుకుని జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. చర్ల కు చెందిన ఎం.శ్రీ విద్యా దొర 100 మీటర్ల పరుగుపందెంలో మరియు లాంగ్ జంప్ లో రెండు బంగారు పతకలు గెలుపొందారు. భద్రాచలంకి చెందిన ఎస్కే.అమ్రిన్ జావీలిన్ లో బంగారు పతకం, టి అవంతిక సాయి మంజుశ్రీ 150 మీటర్ల పరుగు పందెం లో బంగారు పతకం,బి. పృద్విక జావీలిన్ లో రజత పతకం, కొత్తగూడెం కు చెందిన సిహెచ్.వేదశ్రీ షాట్ పుట్ లో రజత పథకం, బి.శైలేష్ షాట్ పుట్ లో రజక పథకం పాల్వంచకు చెందిన బి. సౌమ్య జావీలిన్ లో రజిత పథకం, ఏ.నందిని జావిలిన్ లో కాంస్య పథకం, ఎస్. అక్షిత జాలిలైన్ లో కాంస్య పథకం గెలుపొందారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడల అధికారి ఎం. పరంధామ రెడ్డి మరియు తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కే. సారంగపాణి విజేతలను మరియు అథ్లెటిక్స్ కోచ్‌లు పి. నాగేందర్, డి.మల్లికార్జున్, జన్ను గిరి ప్రసాద్ లను ప్రత్యేకంగా అభినందించారు.




## కాంగ్రెస్ పార్టీ కల్లూరు పట్టణ ఇంచార్జీగా కోసూరు వెంకటేశ్వర్లు..

- డీసీసీ అధ్యక్షులు నుండి నియామక పత్రం అందజేత..
- నమ్మకానికి దక్కిన అరుదైన గౌరవం..






ఖమ్మం జిల్లా/ తల్లాడ టౌన్ ఆగస్టు 8( అక్షరం న్యూస్)

ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కల్లూరు మున్సిపాలిటీ (పట్టణ) ఇన్చార్జిగా తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు కోసూరు వెంకటేశ్వర్లు (లోకల్ కేవీ) నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ నుండి ఆయన నియామకపు పత్రాలను అందుకున్నారు. గత 20 ఏళ్ల నుండి కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేసిన ఆయన సేవలను గుర్తించిన జిల్లా పార్టీ ఈ పదవికి ఎంపిక చేసింది. పార్టీ అధికారంలో ఉన్నా లేకపోయినా పార్టీని నమ్ముకుని సుదీర్ఘకాలం పాటు కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఆయనను కల్లూరు పట్టణ ఇన్చార్జిగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కల్లూరు ఇన్చార్జిగా నియమించడం సంతోషంగా ఉందన్నారు. పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు శ్రమిస్తానని పేర్కొన్నారు. తన నియమకానికి కృషి చేసిన డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలకు ఆయన పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

# అరుణాచల్‌పై చైనా కుట్రలకు చెక్

### అరుణాచల్ మ్యాప్‌ను విడుదల చేసిన భారత్

న్యూఢిల్లీ,ఆగస్ట్8 భారత్‌లోని అరుణాచల్ ప్రదేశ్‌లో పలు ప్రాంతాలను తమవిగా చెప్పుకునే చైనాకు భారత్ గట్టి కౌంటర్ ఇచ్చింది. ఆ రాష్ట్రంలోని నాలుగు మౌంటెయిన్ పాస్‌లు, ఒక సరస్సు సహా 27 కీలక ప్రాంతాలతో కూడిన సవివరమైన ప్రామాణిక మ్యాప్‌ను సర్వే ఆఫ్ ఇండియా విడుదల చేసింది. ఇరు దేశాల మధ్య సరిహద్దుకు సంబంధించి పూర్తి క్లారిటీతో ఈ మ్యాప్‌ను విడుదల చేసింది. అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపుల తరువాత ఈ మ్యాప్‌ను ఖరారు చేసినట్టు హోంశాఖ తెలిపింది. తాజా మ్యాప్‌తో ప్రజలకు మరింత అవగాహన పెరుగుతుందని సర్వే ఆఫ్ ఇండియా చెప్పింది. మ్యాప్‌లో తాజాగా చేర్చిన 27 ప్రాంతాల్లో సరిహద్దున ఉన్న మూడు ప్రాంతాలకు (సుబన్‌సిరి జిల్లా) వ్యూహాత్మక ప్రాధాన్యం ఉంది. అదే జిల్లాలోని నాలుగు మౌంటెయిన్ పాస్‌లను కూడా మ్యాప్‌లో చూపించారు. ఈ ప్రాంతాలన్నీ మిలిటరీ మ్యాపుల్లో ఇప్పటికే అందుబాటులో ఉన్నప్పటికీ సర్వే ఆఫ్ ఇండియా మ్యాపులో వీటిని స్పష్టంగా చూపించడమంటే చైనాకు గట్టి కౌంటర్ ఇచ్చినట్టేనని సంబంధిత వర్గాలు తెలిపాయి. మ్యాపులో చూపించిన పలు ప్రాంతాల్లో చైనా, భారత్ దళాల మధ్య ఘర్షణలు జరిగాయి. అరుణాచల్ ప్రదేశ్‌ను దక్షిణ టిబెట్ అని పిలిచే చైనా ఆ రాష్ట్రంలోని 23 ప్రాంతాలకు కొత్త పేర్లను ఖరారు చేస్తూ ఒక ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే. అయితే, ఈ చర్యలతో క్షేత్రస్థాయిలో ఎలాంటి మార్పులు ఉండవని చైనాకు భారత్ అప్పట్లోనే గట్టి కౌంటర్ ఇచ్చింది. అరుణాచల్ ప్రదేశ్ ఎప్పటికీ భారత్‌లో భాగంగానే ఉంటుందని స్పష్టం చేసింది. చైనా, భారత్‌ల మధ్య సరిహద్దు రేఖ మెక్‌మెహన్ లైన్ టిబెట్, అరుణాచల్ ప్రదేశ్‌ను వేరు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో అరుణాచల్ ప్రదేశ్‌లో 27 ప్రదేశాలకు భారత్ కొత్త పేర్లను పెట్టింది. కొన్ని ప్రదేశాలకు చైనా పేర్లు పెడుతున్న నేపథ్యంలో.. దానికి కౌంటర్‌గా ఇండియా కూడా కొత్త పేర్లను ఖరారు చేసింది. భారతీయ మ్యాప్‌లో సుమారు 27 ప్రదేశాలను గుర్తించి .. వాటికి ఇండియా కొత్త పేర్లను పెట్టింది. అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్‌లో ఆ ప్రదేశాలను గుర్తించారు. స్థానికులు గుర్తుపట్టే రీతిలో ఆ పేర్లను పెట్టినట్లు ప్రకటనలో తెలిపారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని కొన్ని ప్రదేశాలకు చైనా పేర్లు పెట్టడాన్ని భారత్ వ్యతిరేకించిన విషయం తెలిసిందే. వాస్తవాధీన రేఖ వెంట ఉన్న లాంగ్ జూ ప్రాంతం కూడా కొత్తగా పేరు పెట్టిన ప్రదేశంలో ఉన్నది. ఇక్కడే 1959లో ఇండియా, చైనా మధ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈ ప్రాంతంలోకి చైనా దళాలు ఎంటర్ అయ్యాయి. లాంగ్ జూ సమీపంలో ఉన్న మాజా అనే గ్రామాన్ని కూడా కొత్త మ్యాప్‌లో మార్క్ చేశారు. ఇది అప్పర్ సుబన్‌సిరి జిల్లాలో ఉన్నది. పర్వత ప్రాంతాలైన జో లా, రిజా లా, పుకుర్ లాతో పాటు బిసా గ్రామం కూడా కొత్త లిస్టులో ఉన్నది. హై ఆల్టిట్యూడ్ పాసేజ్‌లో థాగ్ లా ఉన్నది. 1962లో ఇదే ప్రాంతంలో భారత్, చైనా మధ్య ఘర్షణ జరిగింది. ప్రస్తుతం ఈ ప్రాంతాన్ని కూడా అధికారికంగా మ్యాప్‌లో గుర్తించారు. చాంగ్‌లాంగ్ జిల్లాలో ఉన్న జైరాంపూర్‌ను కూడా లిస్టులో పెట్టారు. సాంబో సరోవర్, బారా కుందన్, చోటా కుందన్, దాన్ బారి, ప్రిత్‌నగర్, తెరిత్నగర్, రామ్‌నగర్, జశ్వంత్ ఘర్, సాగర్, పద్మ, జ్యోతినగర్, బైసాకి ప్రాంతాలు కొత్త లిస్టులో ఉన్నాయి. షేర్ ఏ తప్పా స్మారకం, చోటా రూపక్, బారా రూపక్, శివాజీ నగర్, సున్పురా, కమలాంగ్ నగర్, కమలాంగ్ సాంక్చరీ, బుద్ధామందిర్ కూడా జాబితాలో ఉన్నాయి. అరుణాచల్ ప్రదేశాన్ని .. జాంగ్‌నాన్ అని చైనా పిలుస్తున్నది.



# 12న ఇరుముడి ట్రైలర్ విడుదలకు సన్నాహాలు

మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా తెరకెక్కుతున్న తాజా చిత్రం 'ఇరుముడి' ట్రైలర్‌ను ఆగస్టు 12న విడుదల చేయనున్నారు. భీమవరంలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఈ ట్రైలర్ లాంచ్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. 'నిన్ను కోరి', 'టక్ జగదీష్' వంటి చిత్రాలతో తనదైన గుర్తింపు తెచ్చుకున్న శివ నిర్వాణ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొంది.ఇప్పటివరకు సినిమాకు సంబంధించి విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్, ఇతర ప్రచార చిత్రాలు ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్‌ను అందుకున్నాయి. ముఖ్యంగా కుటుంబ కథాంశానికి భక్తి అంశాలను జోడించి సినిమాను రూపొందిస్తున్నట్లు తెలుస్తుండటంతో 'ఇరుముడి'పై అంచనాలు మరింత పెరిగాయి. ట్రైలర్ విడుదల కార్యక్రమానికి చిత్ర బృందంతో పాటు అభిమానులు, సినీ ప్రేక్షకులు భారీగా హాజరయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే 'ఇరుముడి' నుంచి వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై పాజిటివ్ వైబ్స్‌ను తీసుకొచ్చింది. దీంతో ట్రైలర్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. కుటుంబ భావోద్వేగాలు, భక్తి అంశాలతో పాటు రవితేజకు సంబంధించిన మాస్ ఎలివేషన్స్‌ను ట్రైలర్‌లో ఎలా చూపించారనేది ఆసక్తికరంగా మారింది. ట్రైలర్ కూడా ప్రేక్షకులను మెప్పిస్తే సినిమా విడుదలకు ముందే హైప్ మరింత పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా రవితేజను శివ నిర్వాణ ఏ తరహా పాత్రలో చూపించారనే విషయం ట్రైలర్ ద్వారా స్పష్టత వచ్చే అవకాశం ఉందని అభిమానులు భావిస్తున్నారు. ఈ సినిమాలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తున్నారు. రవితేజ కుమార్తె పాత్రలో బేబీ నక్షత్ర కనిపించనుంది. కుటుంబ బంధాలు, భావోద్వేగాలకు ప్రాధాన్యత ఉన్న కథలో ఈ తండ్రీకూతుళ్ల బంధం కీలకంగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. మాస్ మహారాజా ఇమేజ్‌కు భిన్నంగా కుటుంబ భావోద్వేగాలను, భక్తి అంశాలను కలగలిపి శివ నిర్వాణ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. దీంతో 'ఇరుముడి' రవితేజ కెరీర్‌లో మరో విభిన్నమైన సినిమాగా నిలుస్తుందా అన్న ఆసక్తి నెలకొంది. కాగా 'ఇరుముడి' ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.




## రామాయణ తొలుత విదేశాల్లో విడుదల




రామాయణం ఇతిహాసం ఆధారంగా తెరకెక్కుతోన్న ప్రతిష్టాత్మక చిత్రం 'రామాయణ' ప్రపంచవ్యాప్త విడుదలపై నిర్మాత నమిత్ మల్హోత్రా కీలక ప్రకటన చేశారు. ఈ సినిమాను అంతర్జాతీయ మార్కెట్‌లో ముందుగా.. ఆ తర్వాత భారత్‌లో విడుదల చేసేలా వినూత్న వ్యూహాన్ని అనుసరిస్తున్నట్లు వెల్లడించారు. తాజాగా ఓ ఆంగ్ల మీడియాతో ఆయన మాట్లాడారు. నవంబర్ 6న విదేశాల్లో 'రామాయణ' విడుదల చేస్తున్నాం. విదేశీ మార్కెట్లలో సినిమాల విడుదల సాధారణంగా శుక్రవారం నుంచే ప్రారంభమవుతుంది. ఇండియాలో మాత్రం దీపావళి నవంబర్ 8 రోజే విడుదల చేస్తాం అని చెప్పారు. దిగ్గజ దర్శకుడు నితీశ్ తివారీ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ భారీ బడ్జెట్ దృశ్యకావ్యంలో శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణాసురుడిగా యష్, హనుమంతుడిగా సన్నీ దేవోల్, లక్ష్మణుడిగా రవి దూబే నటిస్తున్నారు. ఆస్కార్ విజేతలు ఏ.ఆర్. రెహమాన్, హన్స్ జిమ్మర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఇండియాలో ధర్మ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని పంపిణీ చేస్తుండగా, ఓవర్సీస్ హక్కులను సోనీ పిక్చర్స్ దక్కించుకుంది. సంగీత హక్కులను టీ-సిరీస్ రూ. 75 కోట్లకు సొంతం చేసుకున్నట్లు సమాచారం.

# వామప్ మ్యాచ్‌లో పోరాడుతోన్న భారత్



శ్రీలంకతో రెండు టెస్టుల సిరీస్‌కు సన్నాహకంగా జరుగుతున్న వామప్ మ్యాచ్‌లో భారత్ పోరాడుతోంది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 90 ఓవర్లలో 8 వికెట్లకు 357 పరుగులు చేసింది. దేవదత్ పడిక్కల్(164 బంతుల్లో 18 ఫోర్లతో 142 నాటౌట్) అజేయ సెంచరీతో చెలరేగగా.. రవీంద్ర జడేజా(117 బంతుల్లో 7 ఫోర్లతో 63) హాఫ్ సెంచరీతో రాణించాడు. మానవ్ సుతార్(90 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 41), సరాన్ష్ జైన్(22), గుర్నూర్ బ్రార్(17 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సలతో 36 నాటౌట్) విలువైన పరుగులు చేశారు.శ్రీలంక ఎలెవన్ బౌలర్లలో రమేష్ మెండీస్, అసంక మనోజ్ రెండేసి వికెట్లు తీయగా.. విశ్వ ఫెర్నాండో, కేశర నువాంత తలో వికెట్ తీసారు. భారత్ ఇంకా శ్రీలంక కంటే 6 పరుగుల వెనుకంజలో ఉంది. రెండో రోజు ఆటలో బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆరంభంలోనే బిగ్ షాక్ తగిలింది. విశ్వ ఫెర్నాండో వేసిన తొలి ఓవర్ రెండో బంతికే యశస్వి జైస్వాల్(0).. దిలుమ్ సుదీర్‌కు క్యాచ్ ఇచ్చి సిల్వర్ డక్‌గా వెనుదిరిగాడు. వైడ్‌బాల్‌ను వెంటాడి మరీ మూల్యం చెల్లించుకున్నాడు. కెప్టెన్ కేఎల్ రాహుల్‌తో పాటు, దేవదత్ పడిక్కల్ ఆచితూచి ఆడి రెండో వికెట్‌కు 96 పరుగులు జోడించారు. హాఫ్ సెంచరీకి చేరువైన కేఎల్ రాహుల్(40)ను నువాంత క్లీన్ బౌల్డ్ చేశాడు.రవీంద్ర జడేజా సాయంతో ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించిన దేవదత్ పడిక్కల్ 121 బంతుల్లో సెంచరీ మార్క్ అందుకున్నాడు. ఆ మరుసటి బంతికే రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. దాంతో క్రీజులోకి రిషభ్ పంత్ వచ్చాడు. కానీ అతను ఐదు బంతుల్లో 2 పరుగులు చేసి క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. ధ్రువ్ జురెల్ కూడా ఆ కాసేపటికే క్యాచ్ ఔటయ్యాడు. ఈ ఇద్దరినీ స్పిన్నర్ రమేష్ మెండీస్ పెవిలియన్ చేర్చాడు. దాంతో భారత్ 174 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ పరిస్థితుల్లో జడేజా, మానవ్ సుతార్ జట్టును ఆదుకున్నారు. ఈ ఇద్దరూ ఆరో వికెట్‌కు 76 పరుగులు జోడించారు. హాఫ్ సెంచరీ అనంతరం రవీంద్ర జడేజా రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగ్గా.. కుల్దీప్ యాదవ్(1) గాయంతో తప్పుకున్నాడు. మహమ్మద్ సిరాజ్(1) క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. సరాన్ష్ జైన్(22) పరుగుల తర్వాత రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగ్గా.. దేవదత్ పడిక్కల్ తిరిగిన బ్యాటింగ్‌కు వచ్చాడు. గుర్నూర్ బ్రార్‌తో కలిసి అతను రెండో రోజు ఆటను ముగించాడు...



## కొరియన్ కనకరాజుతో హిట్ కొట్టిన వరుణ్ తేజ్




మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్‌కు గత కొంతకాలంగా హిట్ కోసం ఎదురుచూస్తున్నారు. తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'కొరియన్ కనకరాజు' వరుణ్ తేజ్‌కు భారీ ఊరటనిచ్చేలా బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్తోంది. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహించిన ఈ హారర్ కామెడీ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితిక నాయక్ హీరోయిన్‌గా నటించింది. సత్య కీలక పాత్రలో కనిపించారు. విడుదలకు ముందు నుంచే మంచి బజ్‌ను సొంతం చేసుకుంది. తాజా సమాచారం ప్రకారం 'కొరియన్ కనకరాజు' ప్రీమియర్స్, తొలి రోజు కలిపి రూ.10.2 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసినట్లు చిత్ర బృందం ప్రకటించింది. హారర్ కామెడీ జోనర్‌లో తెరకెక్కిన సినిమాకు ఇది మంచి ఓపెనింగ్‌గా చెప్పొచ్చు. అంతేకాదు.. వరుణ్ తేజ్ కెరీర్‌లో ఇదే బిగ్గెస్ట్ ఓపెనర్గా నిలిచినట్లు మేకర్స్ వెల్లడించారు. గతంలో వరుణ్ తేజ్‌కు అత్యధిక ఓపెనింగ్ అందించిన 'గద్దలకొండ గణెళిష్' సినిమాను 'కొరియన్ కనకరాజు' అధిగమించింది. దీంతో చాలా కాలం తర్వాత వరుణ్ తేజ్ అభిమానుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది.దేశీయ మార్కెట్‌తో పాటు ఓవర్సీస్‌లోనూ సినిమా మంచి ఆరంభాన్ని అందుకుంది. ముఖ్యంగా అమెరికాలో ఇప్పటివరకు 1.75 లక్షల డాలర్ల గ్రాస్ సాధించినట్లు సమాచారం. సినిమా థియేట్రికల్ రైట్స్‌కు అనుగుణంగా చూస్తే ఇదే ట్రెండ్‌ను కొనసాగిస్తే బ్రేక్ ఈవెన్ దిశగా వెళ్లే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. విడుదలకు ముందే అడ్వాన్స్ బుకింగ్స్‌లో కూడా 'కొరియన్ కనకరాజు' మంచి జోరు చూపించింది. బుక్‌మైషో, డిస్ట్రిక్ట్ యాప్‌లలో కలిపి 2.5 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు చిత్ర బృందం వెల్లడించింది. తొలి రోజు వసూళ్లతో పాటు సినిమాకు వస్తున్న మౌత్ టాక్ కూడా పాజిటివ్‌గా ఉండటం మేకర్స్‌కు మరింత కలిసొచ్చే అంశంగా మారింది.

## త్రివిక్రమ్‌తో మా బంధం బలమైనది

### సూర్యదేవర నాగవంశీ వెల్లడి

ఒక బ్యానర్‌లో పనిచేసే వ్యక్తుల మధ్య మంచి అనుబంధం ఏర్పడితే.. అదే బంధం కొనసాగుతుందని, దానికి ప్రత్యేకమైన అగ్రిమెంట్లు అవసరం లేదని ఆయన పేర్కొన్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నాగవంశీ.. నిర్మాతల కాంపౌండ్స్, దర్శకుడు త్రివిక్రమ్‌తో తమ కుటుంబానికి ఉన్న అనుబంధం గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించారు. డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో వారి కుటుంబానికి ఉన్న అనుబంధం గురించి నాగవంశీ మాట్లాడుతూ.. తన బాబాయి (చిన్నబాబు) ఇండస్ట్రీలోకి రావాలని అనుకున్న సమయంలో తొలి సినిమాను త్రివిక్రమ్ దర్శకత్వంలోనే చేయాలని కోరుకున్నారని తెలిపారు. త్రివిక్రమ్ పనితీరు, సినిమాలపై ఆయనకు ఉన్న అభిమానం కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ఆ సమయంలో 'జులాయి' సినిమా ప్రారంభమైనప్పటి నుంచి త్రివిక్రమ్‌తో తమ అనుబంధం మరింత బలపడిందని నాగవంశీ పేర్కొన్నారు. 'హారిక అండ్ హాసిని క్రియేషన్స్' అనే బ్యానర్ పేరును కూడా త్రివిక్రమే సూచించారని, ఆ బ్యానర్ లోగోను సైతం ఆయనే డిజైన్ చేశారని వెల్లడించారు. 'అప్పటి నుంచి ఇప్పటివరకు త్రివిక్రమ్ బయట బ్యానర్‌లో సినిమా చేయలేదు. దీనికి ఎలాంటి అగ్రిమెంట్లు లేవు. మా మధ్య ఉన్న రిలేషన్‌షిప్ అలాంటిది. ఒక ఫ్యామిలీలా అయిపోయాం' అని నాగవంశీ చెప్పుకొచ్చారు.త్రివిక్రమ్ తమ బ్యానర్‌తోనే వరుసగా సినిమాలు చేస్తూ ప్రయాణం కొనసాగిస్తున్న నేపథ్యంలో.. తమ వైపు నుంచి కూడా ఆయనకు ఎక్స్‌క్లూజివిటీ ఇవ్వడం సహజమేనని నాగవంశీ అన్నారు. 'హారిక అండ్ హాసిని క్రియేషన్స్' బ్యానర్‌ను ప్రధానంగా త్రివిక్రమ్ సినిమాల కోసం కొనసాగిస్తున్నట్లు వివరించారు. అయితే త్రివిక్రమ్‌కు ఆ బ్యానర్‌లో వాటా ఉందనే ప్రచారంపై కూడా నాగవంశీ క్లారిటీ ఇచ్చారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్‌లో త్రివిక్రమ్‌కు ఎలాంటి షేర్ లేదని, ఆయనకు రెమ్యునరేషన్ మాత్రమే ఉంటుందని స్పష్టం చేశారు. ఆయనకు సంబంధించిన షేర్ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌లో ఉంటుందని తెలిపారు. అలాగే సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌కు సంబంధించిన ప్రాజెక్టుల్లో త్రివిక్రమ్ కీలకంగా భాగస్వామ్యం అవుతున్నారని, స్క్రిప్టులు, ఇతర సినిమా విషయాల్లో ఆయన సలహాలు కూడా తీసుకుంటామని నాగవంశీ వెల్లడించారు. త్రివిక్రమ్‌తో తమ బంధం కేవలం సినిమాలకు సంబంధించినది మాత్రమే కాదని.. సంవత్సరాలుగా కొనసాగుతున్న అనుబంధమే తమ ప్రయాణానికి కారణమని నాగవంశీ చెప్పుకొచ్చారు.



Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers, RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609